**రిపోర్టర్లు కావలెను**

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న **'జర్నలిస్ట్ ఫైల్'** దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం :
9502535152, 7416812467

ఆదివారం 02.06.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -131 www.journalistfile.com పేజీలు 6 వెల : రూ.5.00

## గులకరాయి కేసు బెయిల్ పై విడుదల కానున్న నిందితుడు




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీ జగన్‌పై రాయిదాడి కేసులో నిందితుడు సతీశ్‌కు విజయవాడ 8వ అదనపు జిల్లా కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీంతో సతీశ్‌ను జైలు నుంచి విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి.
నిందితుడు సతీశ్ ను విడుదల చేయాలంటూ అనుమతి ఇచ్చారు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్. 445 సీఆర్పీసీ పిటిషన్‌ను అనుమతిచ్చి, నిందితుడిని విడుదల చేయాలని చెప్పారు. ఆదివారం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి సతీశ్ విడుదల కానున్నాడు.
కాగా, బెయిల్ మంజూరు వేళ పలు షరతులు విధించింది కోర్టు. ప్రతి శని, ఆదివారాల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని చెప్పింది. అలాగే, రూ. 50 వేలకు ఇద్దరు షూరిటీలు ఇవ్వాలని ఆదేశిస్తూ ఊరు వదిలి వెళ్లకూడదని తెలిపింది.
కేసులో పోలీసుల విచారణకు సహకరించాలని చెప్పింది. ఎన్నికల వేళ ఏప్రిల్ 13న విజయవాడలో జగన్‌పై రాయి దాడి జరిగింది. జగన్? పై నిందితుడు రాయి విసరడంతో ఆయన కనుబొమ్మ పైభాగంలో అది తాకి గాయమైంది.

## సీఐ నారాయణ స్వామి పై ఈసీ వేటు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎమ్మెల్యే పిన్నెల్లి పిటిషన్ ఎఫెక్ట్.. ఆపై హైకోర్టు ఆదేశాలతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు కదిలింది. కారంపూడి సీఐ నారాయణస్వామిని విధుల నుంచి తప్పించింది. తప్పుడు కేసులతో వేధిస్తున్నారంటూ నారాయణ స్వామితో పాటు ఇద్దరు పోలీస్ అధికారుల పై మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా చర్యలు చేపట్టాలని సీఈవోకు ఏపీ హైకోర్టు ఆదేశించింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు ఈసీ సీఐ నారాయణ స్వామిని తప్పించింది. అంతేకాదు.. నారాయణ స్వామిపై సిట్ విచారణకు ఆదేశించారు ఏపీ ఎన్నికల సంఘం ప్రధానాధికారి ఎంకే మీనా. ఆధారాలు సమర్పిస్తే ఇతర అధికారుల పైనా విచారణ చేపడతామని ఆయన అంటున్నారు.

# ఏపీ ఎగ్జిట్ పోల్స్ విడుదల




- ఉత్కంఠను రేపుతున్న ఎగ్జిట్ పోల్స్
- ఏ పార్టీకి ఎన్ని సీట్లో తెల్చిన ఎగ్జిట్ పోల్స్
- ఎగ్జిట్‌పోల్స్‌లో కూటమిదే హవా
- అసెంబ్లీ, పార్లమెంట్‌లో ఆధిక్యం చాటుతున్న ఎన్డీయే కూటమి
- ప్రధానంగా 4 సంస్థల సర్వే విడుదల
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే...
- జూన్ 4న తుది ఫలితాలు విడుదల

2లో

# క్షణక్షణం భయం

- శిధిలావస్థలో ఏలూరు జూట్ మిల్లు ఫ్లై ఓవర్
- ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం
- దానిపైనే వాహనాల రాకపోకలు
- అధికారులు పట్టించుకోవడంపై ప్రజల ఆగ్రహం
- ఏదైనా ప్రమాదం జరిగితే భారీగా ప్రాణ నష్టం

**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఏలూరు జూట్‌మిల్లు వద్ద ఫ్లైఓవర్‌పై ప్రయాణం క్షణక్షణం భయంగా మారింది. సుమారు 40 ఏళ్ల

2లో



## పిన్నెల్లి నుంచి ప్రాణహాని ఉంది

- సుప్రీంను ఆశ్రయించిన నంబూరి శేషగిరిరావు

**అమరావతి:** మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బాధితుడుగా పేర్కొనబడుతున్న నంబూరి శేషగిరిరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు ప్రాణహాని ఉందని కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. పిన్నెల్లికి హైకోర్టు ఇచ్చిన అరెస్టు మినహాయింపు ఆదేశాలు రద్దు చేయాలని అందులో కోరాడు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో తనపై దాడి చేశారని వివరించాడు. కౌంటింగ్ రోజు కూడా హింసకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నాడు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనపై శేషగిరిరావు మరో పిటిషన్ దాఖలు చేశాడు. ఆధారాలున్నా ఎమ్మెల్యే పేరు, అనుచరుల పేర్లు లేకుండా కేసు పెట్టారని.. గుర్తు తెలియని వ్యక్తులంటూ ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరించారని పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ అంశాలన్నీ హైకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా ముందస్తు బెయిల్ ఇచ్చిందని వివరించాడు. తీవ్ర ఘటనలైనా బెయిల్ మంజూరు ఆందోళన కలిగిస్తోందని.. మాచర్ల నియోజకవర్గంలో ప్రతిపక్షాలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నాడు. శేషగిరి రావు దాఖలు చేసిన రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనుంది.



## దడ పుట్టిస్తున్న ఉద్యోగులు


- వైసీపీ అభ్యర్థులకు నిద్రలేకుండా చేస్తున్న పోస్టల్ బ్యాలెట్ టెన్షన్
- స్వల్ప మెజార్టీతో ఓడిపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులే కారణం అనే చర్చ

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సార్వత్రిక ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తుండటంతో అభ్యర్థుల్లో ఆందోళన, ఉత్కంఠకు తెర లేచింది. గెలుపోటములపై లెక్కలు వేసుకోవడంలో తలమునకలయ్యారు. ఈవీఎంల ద్వారా పడిన ఓట్ల కంటే. ఉద్యోగ, ఉపాధ్యాయులు వేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లే కాకరేపుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో గెలుపోటములపై ఈ ఓట్లే తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు.
నువ్వా.. నేనా అంటూ పోటీ పడుతున్న టీడీపీ, వైసీపీ అభ్యర్థులకు పడిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లే అత్యంత కీలకంగా మారాయి. ఇవే జూన్ 4న అభ్యర్థుల తలరాతను మార్చే స్థాయిలో పోల్ కావడం ప్రస్తావనార్హం. 77 ఏళ్ల ఎన్నికల చరిత్రలో ఏ ఎన్నికలో లేని విధంగా ఈ దఫా ఉద్యోగ, ఉపాధ్యాయుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అత్యధికంగా పోల్ అయ్యాయి. ఇపుడు ఈ ఓట్లే అధికార వైసీపీ అభ్యర్థుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. తమకు ఏమాత్రం పడ్డాయోనన్న ఆందోళనతో వేడెక్కింది. ఎందుకంటే.. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో సీఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ముప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాపారు. విధి నిర్వహణలో తీవ్ర పని ఒత్తిడే కాదు... వారికి దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై కూడా కోలుకోలేని దెబ్బ కొట్టారు. దీని మూలంగా వైసీపీ పాలనపై తీవ్ర వ్యతిరేకత కట్టలు తెచ్చుకుంది. ఈ అసంతృప్తే వారిలో కసి పెంచి.. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు కారణమైంది. ఎన్నడూ లేనివిధంగా వేలల్లో ఓట్లు పోల్ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.
మెరుగైన పీఆర్సీ, డీఏల చెల్లింపు, సీపీఎస్ రద్దు.. వంటి కీలక హామీలను తీరుస్తామంటూ మాటలను నమ్మిన ఉద్యోగ, ఉపాధ్యాయులు గతఎన్నికల్లో వైసీపీకే గంపగుత్తగా ఓట్లు వేశారు. ఐదేళ్లుగా పైహామీల పరిష్కారంపై మోసం చేయడమే కాదు, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను పూర్తిగా అణచివేశారు. వారిలో గూడుకట్టుకున్న ఆవేశం, అక్కసు, అసంతృప్తి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రోజున వెళ్లగక్కారు. అన్ని ప్రాంతాల్లోనూ టీడీపీ అభ్యర్థులకే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడి ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇదే వైసీపీ అభ్యర్థుల్లో అంతర్మథనానికి కారణం.
స్వల్ప మెజార్టీతో ఓడిపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులే కారణమన్న విషయంపై చర్చ జోరందుకుంది. గతంలో కనీవిని ఎరుగని స్థాయిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కావడంపై అంతుచిక్కని కథలా మారింది. కూటమి అభ్యర్థులకే ఎక్కువ పడ్డాయన్న చర్చ నడుస్తోంది. ఇదే తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థుల్లో గుబులు పుడుతోంది. ఉద్యోగ, ఉపాధ్యాయ ఓట్లే కాదు.. వారి కుటుంబసభ్యులు, రక్తసంబంధీకుల ఓట్లపై కూడా ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తుండటంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రభావం ఎంతమేర ఉంటుందన్న దడ కాక రేపుతోంది.




## విజయవాడలో డయేరియా మరణాలు ఆందోళనకరం

- ప్రభుత్వ యంత్రాంగం వెంటనే సమస్యపై దృష్టిపెట్టాలి
- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడలో డయేరియాతో వారం రోజుల వ్యవధిలో 9 మంది చనిపోవడంపై టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. డయేరియా బారిన పడి ఇప్పటి వరకు 9 మంది చనిపోగా.. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత నీరు సరఫరా కారణంగానే ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందని.. దీనిపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. డయేరియాతో కాకుండా ఇతర అనారోగ్య కారణాలతో వీరంతా చనిపోయారని అధికారులు చెప్పడం సరికాదని అన్నారు. కలుషిత నీటిపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ అధినేత ప్రభుత్వాన్ని కోరారు.

# సీఎంఆర్ అల్యూమినియం పరిశ్రమలో 50 మంది అస్వస్థత



**తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏర్పేడు మండలం రాజులపాలెంలోని సీఎంఆర్ అల్యూమినియం పరిశ్రమలో 50 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. అల్యూమినియం తుక్కు కరిగించే క్రమంలో చిన్నపాటి గ్యాస్ సిలిండర్ లీకేజీ కావడంతో దాదాపు 50 మంది కార్మికులు ఉన్నట్టుండి వాంతులు చేసుకొని సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం వారిని వెంటనే రేణిగుంట బాలాజీ ఆస్పత్రికి తరలించింది. వైద్య పరీక్షల అనంతరం ఆరోగ్యం మెరుగుపడిన కార్మికులను తిరిగి పరిశ్రమకు తీసుకొచ్చారు. కొందరు కార్మికుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

## డ్రోన్ కెమెరాలు , భారీభద్రత్రతో కౌంటింగ్‌కు ఏర్పాట్లు




**అనంతపురం ( జర్నలిస్ట్ ఫైల్ ):** మరో మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనుండగా కౌంటింగ్ కేంద్రాల చుట్టూ భారీ భద్రతో ఏర్పాట్లను చేస్తున్నారు. అనంతపురం ఎస్పీ గౌతమ్‌శాలి మాట్లాడుతూ ఏకంగా 9 డ్రోన్లతో 3 కి. మీ చుట్టూ రెడ్ జోన్ పరిధిగా పరిగణిస్తామన్నారు. సెక్షన్ 144, 30 అమలులో ఉంటుందని తెలిపారు. ర్యాలీలు, ధర్నాలు నిషేధించాలని, సమస్యాత్మక ప్రాంతాలలో బలగాలను మరింత రెట్టింపు చేస్తున్నామని ఎస్పీ గౌతమ్ శాలి చెప్పారు.

## ట్రావెల్స్ బస్సు బోల్తా.. 20 మందికి తీవ్రగాయాలు




**చిలకలూరిపేట ( జర్నలిస్ట్ ఫైల్ ):** ట్రావెల్ బస్సు బోల్తాపడడంతో 20మందికి తీవ్రగాయాలైన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడులో చోటుచేసుకుంది. ఈ ప్రమాద ఘటన ఇవాళ ఉదయం చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరి పేట మండలం లింగంగుంట్ల వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా కొట్టింది. బస్సులో ఉన్న 20 మందికి గాయాలు కాగా, ఇద్దరు పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు గుర్తించారు. ఈ సంఘటన జరిగిన వెంటనే పోలీసులు.. అక్కడికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఒంగోలు కందుకూరు వెళ్తున్న సమయంలోనే బస్సు బోల్తా కొట్టింది.

## కుప్పం నియోజకవర్గంలో మరోసారి రెచ్చిపోయిన రౌడీ మూకలు

**చిత్తూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో ఎన్నికల అనంతరం రౌడీ మూకల దాడులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మాచర్ల, తిరుపతి, తాడిపత్రి ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీంతో అధికారులపై వేటు వేసింది. అయినప్పటికీ తమను ఎవరూ ఏం చేయలేరనే భావం అల్లరి మూకల్లో బాగా పెరిగింది. దీంతో గన్నవరం నియోజకవర్గం సహా రాష్ట్రంలో మరికొన్ని చోట్ల దాడులు జరుగుతున్నాయి.
తాజాగా కుప్పం నియోజకవర్గంలో వారం రోజులుగా రౌడీ మూకలు పేట్రేగిపోతున్నారు. దాడులకు తెగబడుతున్నారు. కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో అల్లర్లు సృష్టించాలనే ఉద్దేశంతో రెచ్చిపోతున్నారు. ఎన్.కొత్తపల్లి గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంది. మద్యం సేవించిన అల్లరిమూకలు గుంపులుగా తిరుగుతూ గ్రామస్థులను భయాందోళనలకు గురి చేస్తున్నారు. ప్రశ్నించిన జయశంకర్ అనే వ్యక్తిపై దాడి చేశారు. తీవ్రగాయాలు కావడంతో గ్రామస్థులు ఆస్పత్రికి తరలించి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో పోలీసులు ఎన్ని విధాలుగా హెచ్చరికలు జారీ చేస్తున్నా.. వారు మాత్రం లెక్క చేయడం లేదు. హింసే ఆయుధంగా రౌడీ మూకలు ముందుకు సాగుతున్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని లేదంటే ఓట్లు కౌంటింగ్ రోజు వారు పెద్దఎత్తున దాడులకు తెగబడే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

## 4 రోజులు దుకాణాలు బంద్



**పల్నాడు, మాచర్ల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మాచర్ల మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, ప్రజలు గుంపులుగా బయట తిరగవద్దని మాచర్ల పోలీసులు విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ రోజున బాణసంచా కాల్చడం, ర్యాలీలు, కేక్ కటింగ్, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. ఎవరూ రోడ్లమీదకి రావొద్దని. ఎవరి ఇంట్లో వారు ఉండాలన్నారు. గ్రామాల్లో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 5న సాయంత్రం వరకు అన్నిరకాల షాపులు మూసేయాలని ఆదేశించారు.

# పోస్టల్ బ్యాలెట్ తప్పిదాలపై చర్యలు తీసుకోవాలి

- **పోస్టల్ బ్యాలెట్ వివాదాస్పదం ఎందుకు అయ్యింది?**
- **ఎవరి ప్రోద్భలంతో చేశారో విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి**
- **డిక్లరేషన్ పై సంతకం, టిక్ మార్క్ వేయడమే ఉద్యోగి బాధ్యత**
- **ఐక్యవేదిక చైర్మన్ కె.ఆర్. సూర్యనారాయణ**




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** పోస్టల్ బ్యాలెట్ వివాదాస్పదం ఎందుకు అయ్యింది. ఎవరి ప్రోద్భలంతో చేశారు అని విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని "ఐక్యవేదిక" చైర్మన్ కె. ఆర్. సూర్యనారాయణ, కో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రెటరీ జనరల్ బాజీ పఠాన్, వైస్ చైర్మన్ సి. హెచ్ .పాపారావు ఓ ప్రకటనలో ప్రధాన ఎన్నికల కమిషన్ ను కోరారు.
ఎన్నికల సంఘం ఇచ్చిన సూచనల మేరకు ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ సంబంధించిన కార్యక్రమాలను సంబంధిత అధికారులే పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల అధికారులచే నియమింపబడి నటువంటి గేజిటెడ్ అధికారులు డిక్లరేషన్ ఫామ్ పైన సంతకం, సీలు వేయాల్సి ఉందని తెలిపారు. పూర్తి బాధ్యత ఎన్నికల అధికారులదేనని వక్కాణించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగి కేవలం డిక్లరేషన్ ఫారంపై మాత్రమే సంతకం చేయడం, బ్యాలెట్ పై టిక్ మార్క్ వేయడం మాత్రమే బాధ్యత అని వివరించారు.
ఉద్యోగి ఐడి కార్డు, ఎన్నికల విధుల ఉత్తర్వులు తీసుకొని ఫెసిలిటేషన్ సెంటర్ కు వెళ్లి ఓటు వేశారని విశదీకరించారు .ధ్రువీకరణ తర్వాతనే బ్యాలెట్ పత్రం ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. డిక్లరేషన్ ఫామ్ పైన ఎన్నికల అధికారులు నియమించిన గెజిటెడ్ హోదా కలిగిన వారు సంతకం చేసి ,సీల్ వేయాల్సి ఉందని విశ్లేషిస్తూ...అది చూసుకోవలసిన బాధ్యత ఎన్నికల అధికారులదేనని సోదాహరించారు. ఎన్నికల అధికారులు చేసిన తప్పిదాన్ని ఉద్యోగి ఓటుకు అంట కట్టడం సరికాదన్నారు. ఉద్దేశపూర్వక తప్పిదాలు ఎందుకు ,ఎవరు ప్రోద్భలంతో జరిగాయి అని విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల అధికారులు సంతకం చేయకపోతే,సీలు వేయకపోతే ఉద్యోగి బాధ్యుడు ఎలా అవుతాడని ప్రశ్నించారు.
ఈ నెపంతో ఉద్యోగి ఓటు చెల్లనివ్వకపోతే అది రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని చెప్పారు.
ఓటు (టిక్ మార్క్ )సరిగా వేశాడా లేదా అనేది మాత్రమే చూడాలి. అంతే తప్ప ఇతర కారణాలతో పోస్టల్ బ్యాలెట్ ను తిరస్కరించరాదన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్ నందు ఉద్యోగి కి ఎన్నికల ఉత్తర్వులు ,గుర్తింపు కార్డు ధ్రువీకరణ తర్వాతనే బ్యాలెట్ ఇస్తారు కాబట్టి దొంగ ఓట్లకు ఆస్కారం లేదని తెలిపారు. ఎన్నికల అధికారులు నియమించిన గెజిటెడ్ అధికారులు సంతకం చేయకపోతే, సీలు వేయకపోతే ఎన్నికల అధికారులదే బాధ్యత అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ను ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇతర కారణాలు చూపుతూ తిరస్కరించరాదని కోరారు.

## పులివెందుల - 22.. కుప్పం - 18.. పిఠాపురం - 18.. హిందూపూరం - 19 !

**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కు కౌంట్ డౌన్ మొదలైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మరో మూడు రోజుల్లో (జూన్ 4) కౌంటింగ్ మొదలవ్వబోతుంది. ఆ రోజు మధ్యాహ్నానికల్లా ఒక క్లారిటీ వచ్చేస్తుందని.. రాత్రికి ఫుల్ క్లారిటీ వచ్చేస్తుందని అని అంటున్నారు. ఈ సమయంలో ఎన్నికల కమిషన్ ఎన్ని ఏర్పాట్లూ చేసేస్తోంది
భారీ పోలీసుల మోహరింపు, ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు, మూడంచెల భద్రత నడుమ కౌంటింగ్ జరగబోతుందని అంటున్నారు. పోలింగ్ రోజు పలు ప్రాంతాల్లో జరిగిన అవాంఛనీయ ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈసీ మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈ సమయంలో ఈసారి ఎన్నికల్లో అత్యంత హాట్ టాపిక్ గా మారిన నియోజకవర్గాల్లో ఫలితాలు ఎన్ని రౌండ్లలో వెలువడనున్నాయనేది ఇప్పుడు చూద్దాం...
అవును... ఆంధ్రప్రదేశ్ లోని హాట్ టాపిక్ గా ఉన్న నియోజకవర్గాలలో పులివెందుల, కుప్పం, పిఠాపురం, మంగళగిరి. హిందూపూర్ ఉన్నాయనే చెప్పాలి. దీంతో... ఈ కీలక అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్ని రౌండ్లలో ఈవీఎంల లెక్కింపు జరుగుతుందనే ఆసక్తి నెలకొంది. ఆ లెక్కన చూస్తే... పులివెందులలో ఎక్కువ రౌండ్లలో లెక్కింపు జరగనుంది!. ఇందులో భాగంగా... జగన్ పోటీ చేసిన పులివెందుల సెగ్మెంట్ లో 22 రౌండ్లలో కౌంటింగ్ జరగనుంది. ఈసారి జగన్ మెజారిటీపై.. రాష్ట్రస్థాయిలో ప్రజానికం చూపు పులివెందుల వైపు ఉందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత కుప్పం విషయానికొస్తే... ఇక్కడ అత్యల్పంగా 18 రౌండ్లు ఉన్నాయి. ఈసారి వైనాట్ కుప్పం అని జగన్ ప్రచారం చేయడంతో.. కుప్పంపై ప్రత్యేక ఇంట్రస్ట్ నెలకొందని అంటున్నారు.
ఇక ఈసారి ఎన్నికల్లో అత్యంత హాట్ టాపిక్ గా మారిన నియోజకవర్గాల్లో పిఠాపురం కూడా టాప్ 3లో ఉందనే చెప్పాలి. ఇక్కడ నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈసారి కూటమి తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. వైసీపీ అభ్యర్థి వంగ గీతను గెలిపిస్తే ఆమెను డిప్యూటీ సీఎం చేస్తానని జగన్ చెప్పడంతో ఇక్కడ ఫలితాలపై తీవ్ర ఆసక్తి నెలకొంది. ఇక్కడ కూడా కుప్పం తరహాలోనే 18 రౌండ్ల కౌంటింగ్ ఉంది.
అనంతరం... టీడీపీ యువనేత నారా లోకేష్ పోటీ చేస్తున్న మంగళగిరిపైనా ఈసారి ప్రత్యేక ఆసక్తి రాష్ట్రవ్యాప్తంగా ఉంది. ఈసారి లోకేష్ గెలుస్తారా.. గెలిస్తే ఏ స్థాయి మెజారిటీతో గెలుస్తారు అనే విషయాలపై తెగ చర్చ నడుస్తుంది. ఈ క్రమంలో మంగళగిరి నియోజకవర్గంలో 21 రౌండ్ల కౌంటింగ్ ఉంది. దీంతో.. దీనికి సంబంధించిన తుది ఫలితం కాస్త ఆలస్యం అయ్యే అవకాశం ఉందని అంటున్నారు! ఇక ఈ హాట్ టాప్ 5 నియోజకవర్గాల్లో హిందూపురం కూడా ఒకటనే చెప్పాలి. ఇక్కడ నుంచి టీడీపీ తరుపున నందమూరి బాలకృష్ణ పోటీ చేస్తున్న నేపథ్యంలో... ఈ సారి ఆయన హ్యాట్రిక్ విజయంపైనే అందరి దృష్టి నెలకొంది. మరి.. ఫ్యాన్స్ అంతా భావిస్తున్నట్లు టీడీపీ కంచుకోట హిందూపూరంలో బాలయ్య హ్యాట్రిక్ కొడతారా.. లేక, వైసీపీ అభ్యర్థి దీపిక చేతిలో పరాభవం చెందుతారా అనేది వేచి చూడాలి. ఇక్కడ 19 రౌండ్ల కౌంటింగ్ ఉంది.

# ఇక రెండు రోజులే ... సర్వత్రా ఉత్కంఠ



**రాజమహేంద్రవరం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఇక రెండు రోజులే ఉంది. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటించడానికి అవసరమైన ఏర్పాట్లన్నీ చకచకా నడుస్తున్నాయి. 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు ఆరంభమవుతుంది. మంగళవారం ఉదయం 4.30 గంటల నుంచే సంబంధిత ఓట్ల లెక్కింపు అధికారులు అక్కడకు చేరుకుంటారు. జిల్లాలో మొదటి ఫలితం కొవ్వూ రు అసెంబ్లీ నియోజకవర్గానిదే అవుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఫలి తాలు వెలువడే అవకాశం ఉంది. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ఫలితం చివరిలో వస్తోంది. ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ఘనవిజయం సాధి స్తుందని ఇప్పటికే ఓటర్ల నాడి, సర్వేలు చెబుతున్నాయి. అయినా టెన్షన్ వెంటా డుతోంది. ఇప్పటికే అభ్యర్థులంతా సర్వేలు చేయించుకున్నారు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా ఎగ్జిట్‌పోల్ సర్వే ఫలితాలతో కాస్త ఊరట పొందడం అలవాటైపోయిం ది. దీనికి కారణం కొన్ని ఎగ్జిట్‌పోల్ సర్వేలు నిజం కావడం. కౌంటింగ్ రోజు కంటే ముందుగానే ఒక విధంగా ఫలితాలు ఎలా ఉంటాయనేది, ఎవరు అధికా రంలోకి వస్తారనే విషయాలను ఈ ఎగ్జిట్‌పోల్ సర్వేలు స్పష్టం చేస్తుంటాయి. గతంలో పోలింగ్ జరిగిన వెంటనే ఈఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాలు ప్రకటించే వారు. కానీ సార్వత్రిక ఎన్నికలు దేశవ్యాప్తంగా జరుగుతుండడంతో అన్ని ప్రాం తాల్లో ఎన్నికలు పూర్తయ్యేవరకూ ఎగ్జిట్‌పోల్ ఫలితాలు ప్రకటించకూడదనే ఆం క్షలను ఎన్నికల కమిషన్ విధించింది. దీంతో అన్ని ప్రాంతాల్లో ఎన్నికలు ముగిసిన తర్వాతే వీటిని ప్రకటిస్తారు. దేశంలో మొత్తం ఏడు విడతలుగా ఎన్నికలను ప్రకటించారు.
ఇప్పటికే ఆరు విడతల ఎన్నికలు జరిగిపోయాయి.
శనివారం ఏడో విడత అంటే చివరి విడత పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరగనుంది. ఈ పోలింగ్ ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్ ఫలితాలు దేశవ్యాప్తంగా విడుదల చేస్తారు.

## ఏపీ ఎగ్జిట్ పోల్స్ పై పేర్ని నాని ఏమన్నారంటే...!

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** దేశంలో సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. ఎగ్జిట్ పోల్స్ పై ఓ తెలుగు వార్తా చానల్ నిర్వహించిన డిబెట్ కు ఏపీ మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని హాజరయ్యారు. ఏపీలో వైసీపీకి 13, టీడీపీ కూటమికి 12 లోక్ సభ స్థానాలు వస్తాయన్న ఓ సంస్థ ఎగ్జిట్ పోల్స్ పై పేర్ని నాని స్పందించారు. తమకు 20కి పైగా లోక్ సభ స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఆయా పోల్ ఏజెన్సీలు అనుసరించే శాస్త్రీయ విధానాల్లో లోపాల వల్ల ఓటర్లను అంచనా వేయడంలో పొరబడి ఉండొచ్చని అన్నారు.
కానీ తమకు బలమైన నమ్మకం ఉందని, పోలింగ్ రోజున తమ పార్టీ తరఫున సొంతంగా ఎగ్జిట్ పోల్స్ రూపొందించుకున్నామని పేర్ని నాని వెల్లడించారు. దాని ప్రకారం వైసీపీకి 20 లోక్ సభ స్థానాలు తగ్గవని స్పష్టం చేశారు. ఇక, ఈసారి వైసీపీ, టీడీపీ మధ్య ఓట్ షేరింగ్ హోరాహోరీగా ఉందన్న వాదనలపైనా పేర్ని నాని స్పందించారు. 2014లో వైఎస్ జగన్ ఇమేజ్ ను, 2019 నుంచి 2024 ఎన్నికలకు వచ్చేటప్పటికి జనంలో జగన్ కు ఉన్న ఇమేజ్ ను 100 శాతం పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.
2014 పరిస్థితులనే ఇవాళ కూడా పరిగణనలోకి తీసుకోవాలనడం సరికాదని అభిప్రాయపడ్డారు. 2019 తర్వాత పాజిటివ్ ఓటు శాతం పెరుగుతూ వచ్చిందని పేర్ని నాని వివరించారు.

# ఆశక్తిగా మారిన కాపులు వర్సెస్ కాపుల ఫైట్

**పొలిటికల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** కాపులు వర్సెస్ కాపుల మధ్య జరుగుతున్న పోరులో అందరి దృష్టి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురంపైనే ఉంది. అయితే.. ఇక్కడ మరో ఫ్యాక్టర్ కూడా పనిచేసింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బరిలో ఉండడంతో ఈ వ్యవహారం మరింత సెన్సేషన్ అయింది. ఇక్కడ వైసీపీ నుంచి వంగా గీత పోటీలో ఉన్నారు. ఆమె కూడా కాపు కులస్తురాలే కావడం తెలిసిందే. అయితే.. ఈ నియోజకవర్గంలో సమానంగా.. ఇంకా చెప్పాలంటే ఒకింత ఎక్కువగానే హీటెక్కించిన మరో నియోజకవర్గం సత్తెన పల్లి! పల్నాడు జిల్లా పరిధిలో ఉన్న ఈ నియోజకవర్గంలోనూ కాపులు వర్సెస్ కాపుల మధ్యే పోరు సాగుతోంది.
కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న టీడీపీ నాయ కుడు.. కన్నా లక్ష్మీనారాయణ, వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మంత్రి అంబటి రాంబాబు.. ఇద్దరూ కూడా కాపు నాయకులే. కాపుల్లో పట్టున్న నాయకులే కావడం గమనార్హం. అయితే.. వీరిపై పెద్దగా దృష్టి పెట్టలేదు కానీ.. వాస్తవానికి ఎన్నికల రోజు ఘర్షణలు జరిగిన నియోజక వర్గంలో ఇది కూడా ఉంది. అంతేకాదు.. కన్నా వర్సెస్ అంబటి మధ్య పోరు.. నిజానికి పవన్ వర్సెస్ గీత మధ్య కన్నా ఎక్కువగా జరిగింది. ఈ విషయంలో రెండు సారూప్యతలు మనకు కనిపిస్తాయి. పవన్‌కు మద్దతుగా.. పిఠాపురంలో ప్రచారం చేస్తానంటూ.. ముద్రగడ పద్మనాభం కుమార్తె తెరమీదికి వచ్చారు. అలానే.. ఆమె పవన్ పాల్గొన్న సభలకు కూడా వచ్చారు. రెండు మూడు వీడియోలు చేసి పవన్‌ను బలపరిచే ప్రయత్నం చేశారు. ఇక, సత్తెనపల్లి విషయానికి వస్తే.. ఇక్కడ మంత్రి అంబటి సొంత అల్లుడు(విడాకుల ప్రయత్నంలో ఉన్నారు)డాక్టర్ గౌతం సడెన్‌గా తెరమీదికి వచ్చారు. తన మామ అంబటి దుర్మార్గుడంటూ.. తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి నాయకుడికి ఓటేయొద్దని చెప్పారు. ఈయన కూడా వరుస వీడియోలు చేసి.. తీవ్రస్థాయిలో హీటెక్కించారు. అంటే.. అక్కడ ముద్రగడ కూతురు, ఇక్కడ అంబటి అల్లుడు.. ఇద్దరూ.. కూడా సీన్ రివర్స్ చేసేశారు.
ఇక, పిఠాపురంపై అనేక మంది పందెం రాయుళ్లు పందేలు కట్టారని వార్తలు వచ్చాయి. కానీ, పల్నాడులో పిఠాపురం కంటే కూడా.. ఎక్కువగా పందేలు కట్టిన విషయం చాలా తక్కువ మందికే తెలుసు. ఇక్కడ 150 కోట్ల వరకు పందేలు కట్టినట్టు వైసీపీ నాయకులే చెబుతున్నారు. కన్నాకు అనుకూలంగా మెజారిటీ వర్గాలు పందేలు కట్టాయని.. చెబుతున్నారు. ఇక, పిఠాపురంలో ప్రధాన పార్టీల నాయకులు ప్రచారం చేయగా.. సత్తెనపలి లోనూ.. ప్రధాన పార్టీల నాయకులు చంద్ర బాబు, జగన్‌లు ప్రచారం చేసుకున్నారు. ఎందు కంటే..కాపుల ఓటు బ్యాంకు కీలకమైన సత్తెన పల్లిలో విజయం దక్కించుకునేందుకు వీరు వ్యూహాత్మకంగా ఆ రెండు నియోజకవర్గాల్లోనూ ప్రచారం చేయడం గమనార్హం. చివరగా.. ఉమ్మడి గుంటూరులో రెండే రెండు నియోజక వర్గాల గురించి హాట్ టాప్ జరుగుతోంది. ఒకటి నారా లోకేష్ బరిలో ఉన్న మంగళగిరి, రెండు అంబటి రాంబాబు పోటీలో ఉన్న సత్తెనపల్లి!!

## జగన్ మళ్లీ సీఎం కావాలన్నదే ప్రజల ఆకాంక్ష



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని.. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. స్పష్టమైన ఫలితాలు మళ్లీ ఏపీలో రాబోతున్నాయన్నారు. "ప్రజల నాడి, హృదయ స్పందన వైఎస్సార్సీపీ వైపు ఉంది. ఎగ్జిట్ పోల్స్ అంటే టీడీపీ భయపడుతుంది. ప్రజా తీర్పు అంటే టీడీపీ ఎందుకు భయం?. ప్రజా తీర్పును గౌరవించడానికి, ఓటమిని స్వీకరించడానికి టీడీపీ జీర్ణించుకోలేక పోతుంది. జగన్ సీఎం కాకుండా ఎవ్వరూ అడ్డుకోలేరు" అని రావెల పేర్కొన్నారు. "ప్రజా తీర్పును టీడీపీ గౌరవించాలి. ఐదేళ్ల పాలన సంక్షేమం అభివృద్ధికి ప్రజలు తిరిగి పట్టం కట్టబోతున్నారు. కౌంటింగ్ ప్రక్రియలో టీడీపీ అల్లర్లు చేయాలని చూస్తోంది. పోస్టల్ బ్యాలెట్లో అక్రమాలు చేయాలని టీడీపీ కుట్రలు చేస్తోంది. ఎన్నికల కమిషన్ను ప్రభావితం చేయడానికి టీడీపీ ప్రయత్నిస్తోంది. పోస్టల్ బ్యాలెట్ పై దేశంలో ఎక్కడా లేని నిబంధనను ఏపీలో తేవాలని కుట్రలు చేశారు. ఏపీలో టీడీపీ కుట్రలు ఇకపై సాగవు. న్యాయం, ధర్మం, విజయం వైఎస్సార్ సీపీ వైపు ఉన్నాయి" అని రావెల కిషోర్ బాబు చెప్పారు.

# ఏపీ ఎగ్జిట్ పోల్స్ విడుదల

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** ఏపీ పీఠం ఎవరిదో ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. మే 13న ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. దేశవ్యాప్తంగా ఎన్నికలు ముగియడంతో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల అయ్యాయి. ఈ పోల్స్ ఏపీకి సంబంధించి వైసిపి, టిడిపికి ఎన్ని సీట్లు వస్తాయనేది స్పష్టం చేసేయ్. ఎన్నికల పోలింగ్ తర్వాత చేసిన సర్వేల ఆధారంగా ఈ పోలీసుల విడుదల చేశాయి. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో ఏ పార్టీకి ఎన్ని అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు వస్తాయనేది తేల్చాయి. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసింది. టిడిపి, బిజెపి, జనసేన కూటమిగా బరిలోకి దిగాయి. ఎన్నికల పోలింగ్ లో ఓటర్లు భారీగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన సంస్థలు**
**కేకే సర్వీస్ (అసెంబ్లీ)** టిడిపి- 133, వైసిపి- 14, జనసేన 21, బిజెపి -7
**కేకే సర్వీస్ (పార్లమెంట్)** టిడిపి 17, వైసిపి -0, జనసేన–2, బిజెపి–6
**పీపుల్స్ పల్స్ (అసెంబ్లీ):** టిడిపి–95–110, వైసిపి45–60, బిజెపి–2–5
**పీపుల్స్ పల్స్ (పార్లమెంట్):** టిడిపి13–15, వైసిపి3–5, జనసేన–2, బిజెపి–5
**రైజ్ సంస్థ (అసెంబ్లీ):** టిడిపి113–122, వైసిపి48–60, ఇతరులు–1
**రైజ్ సంస్థ (పార్లమెంట్):** టిడిపి 17–20, వైసిపి7–10
**ఇండియా టీవీ (పార్లమెంట్)** టిడిపి13–15, వైసిపి3,5, జనసేన–2, బిజెపి4,6

# క్షణక్షణం భయం

(మొదటి పేజీ తరువాయి)

క్రితం బ్రిడ్జి నిర్మించారు. జనాభా పెరుగుదలతో పాటు వాహనాల సంఖ్య అధికంగా పెరిగింది. ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలు, బస్సులు ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తాయి. వన్‌టౌన్, టూటౌన్ వచ్చేందుకు ఇదే ప్రధాన మార్గం. బ్రిడ్జి నిర్మాణం పటుత్వం కోల్పోతుంది. శ్లాబు అనేకచోట్ల పూర్తిగా పెచ్చులు రాలిపోతోంది. పిల్లర్లకు కూడా పగుళ్లు ఏర్పడి, ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఆర్‌అండ్‌బి అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో దీని పరిస్థితి ఇలా తయారైంది. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రైల్వే లైన్‌పై బ్రిడ్జిని నిర్మిం చారు. రోజురోజుకు వాహనాల రాకపోకల సంఖ్య విపరీతంగా పెరగడంతో బ్రిడ్జి క్రమేపి శిథిలావస్థకు చేరుతోంది. పగుళ్లతో పాటు స్తంభాలపై మొక్కలు ఏపుగా పెరగడం, శ్లాబు కింద సిమెంట్ బిళ్లలుగా ఊడిపోవడం భారీ వాహనాల రాకపోకలతో బ్రిడ్జి ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తోంది. బ్రిడ్జిపై నిత్యం వేలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. బ్రిడ్జికి అడుగుభాగాన అనేకచోట్ల పగుళ్లు ఏర్పడటంతో పాటు మర్రిచెట్లు మొలిచి ఊడలు బ్రిడ్జిలోపల నుంచి వ్యాపించి ఉన్నాయి. వీటివల్ల బ్రిడ్జికి ఎప్ప టికైనా ప్రమాదమే. అటుగా వెళ్లే అధికారులు బ్రిడ్జి కిందనే నాలుగు, ఐదు ఆర్ అండ్ బీకి చెందిన కార్యాలయాలున్నా కనీసం కన్నెత్తి చూడకపోవడం పై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బిడ్జిపై ఒక పక్క మొత్తం పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన పట్టించుకోకపోవడం శోచనీయమని స్థానికులు మండిపడుతున్నారు.

# గుడి జాగా పై కన్నేసి... గుడిని కూల్చేసి...



- **కౌంటింగుకు ముందు మత ఘర్షణలు రేకెత్తించే కుట్రా ?**
- **విచారణ చేపట్టిన సీఐ పై బెదిరింపులు**

**( కూరపాటి విజయబాబు, రీజనల్ క్రైం బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్ )**

**గుంటూరు నగరం :** గుడి జాగా పై కన్నేసిన ఓ పార్టీ నాయకుడు ... అమ్మవారి గుడి ఆనవాళ్ళు లేకుండా చేసేందుకు రాత్రికి రాత్రే గుడిని కూలగొట్టే ప్రయత్నం చేశాడు. గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డు లో ఉన్న హెూసన్నా మందిరం ఎదురుగా గత 30 ఏళ్ల క్రితం నుండి ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని సమూలంగా తొలగించేందుకు శనివారం తెల్లవారుజామున ఓ ప్రొక్లైనర్ తీసుకొచ్చి గుడిని తొలగించేందుకు విఫల ప్రయత్నం చేశాడు. దీంతో కనకదుర్గ ఆలయం అక్రమ తొలగింపు పై పూజరి మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.
వెంటనే విచారణ చేపట్టిన నల్లపాడు సీఐ నరేష్ కుమార్ ప్రొక్లైనర్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ విషయం నగరం నలుమూలల వ్యాపించడంతో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నల్లపాడు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

**కౌంటింగు కు ముందు మత ఘర్షణలు రేకేతించే కుట్రా ?**

అయితే కనకదుర్గ ఆలయాన్ని తొలగించడానికి కంకణం కట్టుకున్న సదరు నాయకుడు... ... తన నేరంపై కేసు నమోదు చేసిన నల్లపాడు సీఐపై పలు ఆరోపణలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతునట్లు పోలీస్ వర్గాల సమాచారం.
అసలు ఈ నాయకుడు హిందూ దేవాలయాన్ని ఎందుకు కూలగొట్టేందుకు యత్నిస్తున్నాడు ? కౌంటింగ్ కు ముందు ఉద్దేశపూర్వకంగా మత ఘర్షణలు రేకెత్తించే యత్నమా ? ఆ కుట్రను పసిగట్టినందుకే... నిబద్ధతతో నిజాయితీగా విధులు నిర్వర్తించే సీఐపై ఆరోపణలు చేస్తున్నారా అనేదానిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు.
మరో వైపు దేవాలయం కూల్చివేతకు యత్నించిన సమాచారం అందుకున్న బిజెపి నాయకులు, బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ తదితర సంఘాలు ఆందోళనకు సిద్ధం అవ్వడంపై కలకలం రేగుతోంది.

# అమల్లోకి కొత్త ట్రాఫిక్ రూల్స్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ట్రాఫిక్ రూల్స్ జూన్ 1 ( శనివారం ) నుంచి అమల్లోకి వచ్చాయి . అందులో వాహనాలు, ట్రాఫిక్ రూల్స్, డ్రైవింగ్ లైసెన్స్ లాంటి వాటికి సంబంధించిన అంశాల్లో కేంద్ర సర్కార్ ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తుంది. ప్రస్తుతం, దేశంలో వాహనం నడపడం లేదా లైసెన్స్ పొందే వయస్సు 18 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉంది. ఇక, మైనర్లు వాహనాలను నడిపితే 25 వేల రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే, అతనికి 25 ఏళ్లు వచ్చే వరకు ఎలాంటి లైసెన్స్ కూడా లభించదు.
ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమిస్తే భారీ జరిమానా విధించేలా నిబంధనలు మార్పులు చేశారు. కొత్త రూల్ ప్రకారం.. ఓవర్ స్పీడ్ గా వాహనం నడిపితే రూ. 1000 నుంచి రూ. 2000 వరకు ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే 500 రూపాయల జరిమానా కట్టాల్సి ఉంటుంది. అంతే కాకుండా హెల్మెట్, సీటు బెల్ట్ లేకుండా వెహికిల్ నడిపితే 100 రూపాయల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది అని కొత్త నిబంధనలో రూపొందించారు. దీంతో పాటు ఇవాళ్టి (జూన్ 1) నుంచి డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆర్టీఏ ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. డ్రైవింగ్ సూల్‌కు వెళ్లి డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందే అవకాశం ఉంది.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీత రచన పోటీ

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ భౌగోళిక, సాహితీ, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే గీత రచన పోటీలు నిర్వహిస్తున్నామని, ఎంపికైన గీతానికి రూ. లక్ష బహుమానం అందజేస్తామని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.
ఉమ్మడి రాష్ట్ర గీతంగా ఉన్న "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీతాన్ని గౌరవిస్తూనే దాని స్థానంలో వర్తమాన ఆంధ్రప్రాంత వైభవ స్వాభిమాన గీతాన్ని రూపొందించాలని, అందుకు ఐదు నిమిషాల నిడివి గల గీత రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
జూన్ 30వ తేదీ లోపు రూపొందించిన గీతాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్, అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రం, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా చిరునామాకు పంపించాలని సూచించారు

# తిరుమలలో శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం



**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ):** తిరుమలలో యాత్రికుల రద్దీ విపరీతంగా పెరిగింది. వారాంతపు సెలవు దినాలు కావడంతో ఆలయానికి యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండపై ఉన్న అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణం వరకు యాత్రికులు వేచియున్నారు. టోకెన్లు లేని యాత్రికులకు 24 గంటల నుంచి 30 గంటల వరకు సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు.
నిన్న స్వామివారిని 67,873 మంది యాత్రికులు దర్శించుకోగా 33,532 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. యాత్రికులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ కానుకలు రూ. 3.93 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు.

# కడప జిల్లాలో పోలీసుల తనిఖీలు.. కారులో తరలిస్తున్న రూ.1.5 కోట్లు స్వాధీనం

కడప ( జర్నలిస్ట్ ఫైల్ ): కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం జయరాజ్ గార్డెన్స్ సమీపంలోని చెకోపోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కారులో తరలిస్తున్న రూ. 1.5 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన తిరుమలయ్య అనే బంగారు వ్యాపారి నగదును చెన్నైకి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి బిల్లులు లేకపోవడంతో ఆయన వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుని ఐటీ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనపై డీఎస్పీ బృందం దర్యాప్తు చేస్తోంది.

# జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదు

**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని తెలుసుకున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి సచివాలయం నుంచి కీలకమైన ఫైల్స్, ఈ ఫైల్స్ ను మాయం చేసే పనిలో ఉన్నాడని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. అడ్డగోలుగా వ్యవహరిస్తున్న సీఎస్ పట్ల కేంద్ర ఎన్నికల కమిషన్ ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ విధుల నుంచి తప్పిస్తున్న వారి స్థానాల్లో తిరిగి వైసీపీకి అనుకూలంగా వ్యవహరించే అధికారుల పేర్లనే సీఎస్ పంపుతున్నారన్నారు. మంత్రి విడదల రజినీకి తొత్తుగా వ్యవహరిస్తున్న ఆర్ఓ రాజ్యలక్ష్మిని ఓట్ల లెక్కింపు ప్రక్రియ నుంచి వెంటనే తప్పించాలని కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.




# జీజీహెచ్ లో మరో మూడు మెడికల్ స్టోర్ల ఏర్పాటు

- దూరభారం తగ్గించేందుకు కార్యాచరణ
- త్వరలో వైద్యులతో సమీక్ష సమావేశం



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో ఇప్పటివరకు ఒకే మెడికల్ స్టోర్ ఉండటం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వాటిని పరిష్కరించేందుకు నూతనంగా మార్పులు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు.
ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో లో వివిధ విభాగాల వైద్యులతో శనివారం ఆయన సమీక్ష చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి లో ఒకే మెడికల్ స్టోర్ ఉండటం వల్ల సిబ్బంది సకాలంలో వార్డుల్లో మందులను తీసుకుని వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మెడికల్ స్టోర్ నుంచి మందులను తీసుకుని వెళ్లాలంటే స్టోర్ వద్ద గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. దానివల్ల రోగులకు సేవలు అందించే విషయం లో తాత్సారం జరుగుతుంది. ఈ విధానం గత 40 సంవత్సరాల నుంచి కొనసాగుతుంది. ఈ విధానం లో మార్పులు తీసుకుని రావాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.
ఇక నుంచి ఆసుపత్రి ప్రాంగణం లోనే మూడు మెడికల్ స్టోర్ లను ఏర్పాటు చేసి సకాలంలో మందులను వార్డుల్లోకి పంపించాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. దీనివల్ల సిబ్బందికి దూరాభారం తగ్గడమే కాకుండా రోగులకు సిబ్బంది అందుబాటులో ఉండేందుకు అవకాశం కలుగుతుందని ఆయన చెప్పారు. ఆసుపత్రి లోని నాట్కో , పొదిల ప్రసాద్ బ్లాక్ లో , మూడోది కొత్తగా నిర్మాణం కానున్న ఏం సి హెచ్ బ్లాక్ లో మందుల స్టోర్ లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని ఆయన చెప్పారు. దీనిపై వివిధ విభాగాధిపతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని అయన తెలిపారు.

# ఏపీలో ఆల్‌టైం రికార్డును తాకిన విద్యుత్ వినియోగం




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీలో ఎండల తీవ్రత, వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు ఎక్కువ సమయాన్ని ఇళ్ళల్లోనే గడుపుతున్నారు . పైగా చల్లదనం కోసం ఏసీలు ఎక్కువగా వాడుతున్నారు . దింతో విద్యుత్ వినియోగం పెరిగింది. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు అంచనాకి వచ్చారు. గడిచిన మూడు రోజుల్లో కరెంట్‌ను ప్రజలు విపరీతంగా వినియోగిస్తున్నారని చెబుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో విద్యుత్ వినియోగం ఆల్‌టైం హై రికార్డును తాకింది. రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయిలో బుధవారం 253 మిలియన్ యూనిట్లు, గురువారం 259 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. శుక్రవారం కూడా రికార్డుస్థాయిలో 260 మిలియన్ యూనిట్ల దాటే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. అయితే గత ఏడాది ఇదే సమయంలో విద్యుత్ డిమాండ్ 219 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉండడం గమనించదగ్గ విషయం . ఇక గత ఎనిమిదేళ్ల లో మే నెలలో రికార్డు స్థాయి విద్యుత్ వినియోగం కూడా ఇదే కావడం మరో విశేషం. ఎన్నడూ లేని విధంగా 13231 మెగావాట్లకి పైగా విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. గత ఏడాది కంటే 26 శాతం అధికంగా విద్యుత్ డిమాండ్ నెలకొనడం ఇంకో విశేషం.
**కోతలు లేకుండా విద్యుత్ సరఫరా..:** గడిచిన మూడు రోజులుగా ఏపీలో కరెంట్ డిమాండ్ పెరగడంతో , మరో మూడు, నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో వైపు డిమాండ్ పీక్‌లో ఉన్న టైంలోనూ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగుతోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక కారణంగా యూనిట్ విద్యుత్ రూ. 7లకే కొనుగోలు చేస్తోంది. మొత్తం రూ. 15 కోట్లతో 22 మిలియన్ యూనిట్లు కొనుగోలు చేస్తోందని ఏపీ విద్యుత్ శాఖ తెలియచేసింది.

# ఓటమి భయంతో వైసీపీ కోర్టుకు



**పీలేరు ( జర్నలిస్ట్ ఫైల్ ):** వైసీపీ ఓటమి భయంతో కోర్టుకు వెళ్లడం సిగ్గుచేటని పీలేరు టీడీపీ అభ్యర్థి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. పీలేరు నియోజకవర్గం, కలికిరి నగిరిపల్లిలోని తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై వైసీపీ నాయకులు కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది స్వచ్ఛందంగా ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతునిస్తూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. దీంతో వైకాపా నాయకులను ఓటమి భయం పట్టుకుందని దీంతో రకరకాల కుట్రలు పన్నుతూ ఎన్నికల కమీషన్ కు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లడం సిగ్గు మాలిన చర్య అని కిషోర్ కుమార్ రెడ్డి వైసీపీ నాయకులపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో వైకాపా నాయకులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాట్లు పడుతున్నారని, తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించి రాష్ట్రంలో 150 సీట్ల మెజార్టీతో గెలవడం, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమంటూ జోస్యం చెప్పారు

# దోచుకున్న డబ్బును దాచిపెట్టడానికే చంద్రబాబు విదేశీ పర్యటన



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** మే 13 నాలుగో విడత పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర అసెంబ్లీకి కూడా ఎన్నికల జరిగాయి. కాగా ఈ ఎన్నికల అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు విదేశాల పర్యటనకు వెళ్లి వచ్చారు. అయితే ఆయన ఎక్కడ పర్యటించారనే విషయాన్ని మాత్రం బాబుతో పాటు, టీడీపీ వర్గాలు కూడా రహస్యంగా ఉంచాయి. అయితే ఆయన పర్యటనను అంత రహస్యంగా ఉంచడంపై వైసీపీ నేతలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ మంత్రి జోగి రమేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు.
ఏపీలో ప్రజల నుంచి దోచుకున్న డబ్బును నల్లదనం రూపంలో విదేశాల్లో దాచిపెట్టడానికి బాబు వెళ్లారని తాడేపల్లిలోని వైసీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి విమర్శించారు. బాబు ఎక్కడకు వెళ్లారో తెలపాలని కోరితే.. ఒకరేమో విశ్రాంతి కోసం విదేశాలకు వెళ్లారంటుంటే.. మరొకరేమో.. వైద్య పరీక్షల కోసం వెళ్లారని చెబుతున్నారు ఇందులో ఏది నిజమో తెలియదని అన్నారు. అలాగే గతంలో చంద్రబాబు విదేశీ పర్యటనలకు వెళ్లిన ప్రతీ చోటా ఫోటోలు దిగి ప్రచారం చేసుకుంటారని.. కానీ ఈ సారి మాత్రం అలా చేయలేదంటే.. ఏదో జరుగుతోందని.. మంత్రి జోగి రమేష్ అనుమానం వ్యక్తం చేశారు.

# తాడిపత్రిలో భారీ భద్రత



**తాడిపత్రి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసాల వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వారి ఇళ్ల వద్దకు ఎవరు వెళ్లకుండా ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో తాడిపత్రిలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పోలింగ్ రోజు, తర్వాత రోజు జరిగిన ఘర్షణ నేపథ్యంలో తాడిపత్రిలో భారీగా పోలీసులను మోహరించి శాంతి భద్రతలను అదుపులోకి తెచ్చారు. ఎన్నికల కమిషన్ తాడిపత్రిలో జరిగిన అల్లర్లను సీరియస్‌గా తీసుకొని కౌంటింగ్ అనంతరం అల్లర్లు జరుగుతాయన్న ఇంటలిజెన్స్ హెచ్చరికలతో తాడిపత్రికి భారీగా కేంద్ర సాయుధ బలగాలు, ఏపీఎస్పీ బలగాలు వచ్చాయి. జూన్ 6వ తేదీ వరకు తాడిపత్రిలోకి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి తాడిపత్రికి వెళ్లవద్దని హైకోర్టు ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో పోలీసులు తాడిపత్రి చుట్టుపక్కల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తాడిపత్రిలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రాళ్ల దాడి కేసులో ఇప్పటికే 131 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన వారి కోసం గాలింపు చేపడుతున్నారు.

# పాము కాటుతో వైసీపీ నాయకుడు మృతి

**విజయనగరం , గజపతినగరం ( జర్నలిస్ట్ ఫైల్ ):** : వైసీపీ నాయకుడు, గజపతినగరం మార్కెటింగ్ ఆత్మ కమిటీ చైర్మన్ సామంతుల పైడిరాజు పాము కాటుతో శనివారం ఉదయం విశాఖపట్నంలోని ప్రయివేటు ఆసుపత్రిలో మృతి చెందారు. గురువారం నాడు వ్యవసాయ పనులు నిమిత్తం పొలంలోకి వెళ్లిన ఆయన పాముకాటు గురై స్పృహ కోల్పోవడంతో విజయనగరం తిరుమల మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ఒక ప్రముఖ ఆసుపత్రికి తీసుకెళ్లగా తుది శ్వాస విడిచారు. టిడిపి ప్రభుత్వంలో పడాల అరుణ మంత్రిగా ఉన్నప్పుడు లోగిస గ్రామంలో వైస్ సర్పంచిగాను పనిచేశారు. 2012లో కొన్ని కారణాల వలన టిడిపిని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొని ఆ గ్రామంలో స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో లోగిస బంగారునాయుడు గెలుపు కోసం కృషి చేశారు. ఆయన మరణం అనంతరం గ్రామంలో వైఎస్ఆర్సిపికి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెటింగ్ ఆత్మ కమిటీ చైర్మన్గా సేవలందిస్తున్నారు. ఆయన మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# పవన్‌కల్యాణ్ గెలవాలని అభిమాని పొర్లుదండాలు

**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ):** జనసేన అభిమానం ఎల్లలు దాటింది. హనుమాన్ జయంతి సందర్భంగా పిఠాపురంలో పవన్ కల్యాణ్ భారీ మెజారటీతో గెలవాలని.. చంద్రగిరికి చెందిన చిరంజీవి అనే అభిమాని పొర్లుదండాలు పెట్టి.. మొక్కులు చెల్లించుకున్నారు. తనకు టీడీపీ, జనసేన అంటే అభిమానం ఉందని... ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడాలని.. కోరుకున్నట్టు తెలిపారు. దేశంలోనూ ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడాలని హనుమాన్‌ను వేడుకున్నట్టు తెలిపారు.



# కౌంటింగ్ సందర్భంగా ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు

**అన్నమయ్య జిల్లా ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం కొన్ని ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగిన విషయం విదితమే.. అయితే, ఫలితాల సందర్భంగా ఎలాంటి ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేస్తోంది పోలీస్‌యంత్రాంగం.. ఓట్ల కౌంటింగ్ సందర్భంగా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్%ా% అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బంగ్లా సర్కిల్ లో పోలీసు బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ రోజు కానీ.. కౌంటింగ్ అనంతరం కానీ.. ఘర్షణలు జరిగితే ఎలా అణచివేయాలో కళ్ళకు పట్టినట్లు పోలీసులు వివరించారు. జన సమూహం రెచ్చిపోయినప్పుడు లేదా రాళ్లదాడి జరిగినప్పుడు ఎలాంటి చర్యలు చేపడతారన్నది పోలీసులు వివరించారు.
కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడరాదంటూ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు . కౌంటింగ్ రోజు ఎటువంటి ఘర్షణలు జరిగినా అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాని అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్ హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీసులకు సహకరించాలనీ ఆయన కోరారు. కౌంటింగ్ రోజున రాయచోటిలో 144 సెక్షన్ విధించామన్నారు. కౌంటింగ్ ముందు రోజే ఇతర ప్రాంతాలకు చెందిన వారు రాయచోటిని వదిలి వెళ్లాలంటూ ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డిఎస్పి రామచంద్రరావు, అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మరోవైపు చిత్తూరు జిల్లా పుంగనూరులో సెబ్ అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు కీలక సూచనలు చేశారు. ప్రజలు పట్టణంలో నిర్భయంగా ఉండాలని సూచించిన ఆయన.. రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ ముగిసినది. అనంతరం ప్రధాన ఘట్టం జూన్ 4 వతేది న కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఎలాంటి పరిస్థితులు ఎదురైన ఉద్రేకాలకు లోను కాకూడదని తెలిపారు. ప్రజలకు అండగా మేమున్నాం అంటూ శుక్రవారం పుంగనూరు గోకుల్ సర్కిల్ లో సెంట్రల్ ఆర్మీ ఫోర్స్ తో కవాతు నిర్వహించారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు సహనం తో ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో ఫలితాలు వెలువడిన ఎవ్వరు కవ్వింపు చర్యలకు ప్రయత్నం చేయరాదని తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు పట్టణంలో ప్రజలకు ధైర్యం చేకూర్చడానికి కవాతు నిర్వహించారు. ఈ

**తెలంగాణ వార్తలు**

# గొర్రెల పథకం స్కాంలో సీఈవో అరెస్టు

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్: ఒక అవినీతి ఉదంతం వెలుగు చూసిన తర్వాత.. సీన్లోకి వచ్చే అధికారులను అడ్డుకునే ధైర్యం ఎవరూ చేయరు. ఒకవేళ.. వారు ఏసీబీ.. సీబీఐ.. లాంటి విచారణ సంస్థలకు చెందిన వారైతే.. మరింత జాగ్రత్తగా ఉంటారు. అందుకు భిన్నంగా తాజాగా వెలుగు చూసిన గొర్రెల పథకం కుంభకోణంలో చోటు చేసుకున్న కుంభకోణం షాకింగ్ గా మారింది. ఎందుకంటే.. ఈ స్కాం దాదాపు రూ.700 కోట్లు ఉంటుందని చెబుతున్నారు. ఈ పథకం మీద వచ్చిన ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు నిర్వహించగా.. భారీ ఎత్తున అవకతవకలు చోటు చేసుకున్నట్లుగా చెబుతున్నారు. గొర్రెల పథకంపై ఫోకస్ చేసిన ఏసీబీ దర్యాప్తు నివేదిక ప్రకారం దాదాపు రూ.700 కోట్ల ఉండటం.. దీనికి పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో రాంచందర్ నాయక్.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ గుండమరాజు కల్యాణ్ కుమార్ లను తాజాగా ఏసీబీ అరెస్టు చేసింది. ఈ ఇద్దరినీ విచారించిన అనంతరం భారీ మొత్తంలో కుంభకోణం జరిగిందని తేల్చారు. దీంతో.. శుక్రవారం వారిని అరెస్టు చేశారు. అయితే.. ఈ అరెస్టు వేళ అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఏసీబీ అధికారులకే షాకిచ్చేలా కొందరు అడ్డుకున్నారు. నిధుల దుర్వినియోగం మీద రాంచందర్ పాత్ర ఉందన్నవిషయాన్ని గుర్తించిన ఏసీబీ.. ఆయన్ను



అరరెస్టు చేసేందుకు మాసబ్ ట్యాంక్ లోని ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడకు వెళ్లిన ఏసీబీ అధికారులు రాంచందర్ ను కలిసి.. విచారణ కోసం తమ వెంట రావాలని కోరారు. అందుకు ఆయన నో చెప్పారు. ఏసీబీ అధికారుల వెంట వచ్చేందుకు ససేమిరా అన్నారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితి చాలా తక్కువసార్లు

**ఏసీబీ అధికారులను అడ్డుకునేందుకు యత్నించిన సిబ్బంది..**

**రూ.700 కోట్లకు పైగా హాంఫట్**

**మాజీ మంత్రికి సైతం తప్పని ఇక్కట్లు?**

మాత్రమే చోటు చేసుకుంటుంది. దీంతో.. ఏసీబీ అధికారులు తమ తీరును మార్చి.. తమ వెంట రావాలంటూ కాస్తంత కఠినంగా చెప్పాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆయన మొండికేయటంతో ఆయన్ను బలవంతంగా అదుపులోకి తీసుకోవాల్సిన పరిస్థితి. ఈ సందర్భంగా కొందరు ఆయన్ను అదుపులోకి తీసుకోవటాన్ని తప్పుపడుతూ.. ఏసీబీ అధికారులకు అడ్డు తగిలే ప్రయత్నం చేశారు. దీంతో.. వారు తీవ్రంగా రియాక్టు అవుతూ.. హెచ్చరికలు జారీ చేయటంతో కాస్తంత వెనక్కి తగ్గారు. అనంతరం రాంచందర్ ను అరెస్టు చేశారు. ఇటీవల కాలంలో ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదన్న వాదన వినిపిస్తోంది. తాజా అరెస్టు నేపథ్యంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## సోనియా గాంధీ తెలంగాణ పర్యటన రద్దు

- రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సోనియా దూరం
- అనారోగ్య కారణాలతో టూర్ రద్దు చేసుకున్న యూపీఏ చైర్ పర్సన్
- ప్రత్యేక అతిథిగా ఆహ్వానించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ మాజీ చీఫ్, యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ హాజరు కావడంలేదు. అనారోగ్య కారణాలతో తెలంగాణ టూర్ ను సోనియా రద్దు చేసుకున్నారు. ఈ వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరు కావాలంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లి సోనియా గాంధీని ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానాన్ని మన్నించిన సోనియా గాంధీ.. వేడుకలకు హాజరవుతారని మాటిచ్చారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం ఉదయం సోనియా గాంధీ హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న సోనియా ఈ టూర్ విషయంలో తన వ్యక్తిగత వైద్యుడి సలహా కోరారు. సోనియా ఆరోగ్యం దృష్ట్యా ఈ ప్రయాణం మానుకుంటేనే మేలని వైద్యుడు చెప్పడంతో తెలంగాణ టూర్ ను ఆమె రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. అనారోగ్య కారణాలతో రాష్ట్ర అవతరణ వేడుకలకు సోనియా హాజరు కావడంలేదని ఏఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది.



## గద్వాల జిల్లా ఎర్రవల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం..

- నలుగురి దుర్మరణం.. ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టిన స్కార్పియో
- వాహనం బోల్తా పడడంతో మరో ముగ్గురికి గాయాలు
- ఆళ్లగడ్డలో వివాహానికి వెళ్లి తిరిగి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం

హైదరాబాద్,జర్నలిస్ట్ ఫైల్ : శుభకార్యానికి వెళ్లి వస్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. వారు ప్రయాణిస్తున్న స్కార్పియో ఓ లారీని ఢీ కొట్టి బోల్తా పడింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రాంతంలో జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిందీ ఘోరం.. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే చనిపోగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎర్రవల్లి మండల కేంద్రం సమీపంలో జరిగిన ఈ ప్రమాదం వివరాలు..

ఏపీలోని ఆళ్లగడ్డకు చెందిన వెంకటేశ్ తన కుటుంబంతో హైదరాబాద్ లో నివాసం ఉంటున్నాడు. కుటుంబంలో తలా ఓ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆళ్లగడ్డలో ఉంటున్న తన బావమరిది పెళ్లికి హాజరయ్యేందుకు కుటుంబంతో కలిసి వెళ్లాడు. శుభకార్యం పూర్తయ్యాక స్కార్పియోలో భార్య, పిల్లలు, తల్లితో కలిసి హైదరాబాద్ తిరుగు పయనమయ్యాడు. రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న స్కార్పియో గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి సమీపంలో ప్రమాదానికి గురైంది. ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టి బోల్తా పడింది.

దీంతో వెంకటేశ్, ఆయన భార్య పుష్ప, తల్లి లత, మేనల్లుడు ఆదిత్య అక్కడికక్కడే చనిపోయారు. వెంకటేశ్ కొడుకు నందు, కూతురు తరుణి, అక్క కవితలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను హుటాహుటిన కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు.



## దశాబ్ది ఆవిర్భావ దినోత్సవానికి కేసీఆర్ 'నో'

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్: ఆదివారం నాడు దశాబ్ది ఆవిర్భావ దినోత్సవాల కోసం.. తెలంగాణ సర్వ సన్నద్ధమౌతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగే తొలి వేడుకలు ఇవే. దీన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వైభవంగా వ్యవస్థాపక దినోత్సవాలను జరుపుకోవడానికి చర్యలు తీసుకుంది. ఈ వేడుకలకు హాజరు కావాలంటూ భారత్ రాష్ట్ర సమితి అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌ను ఆహ్వానించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు ఇదివరకే కేసీఆర్‌ను కలుసుకున్నారు. ఆవిర్భావ దినోత్సవాలకు హాజరు కావాలంటూ ప్రభుత్వం తరఫున ఆహ్వానించారు. ఈ ఉత్సవాల్లో హాజరు కావాలా? వద్దా? అనే విషయంపై బీఆర్ఎస్ తేల్చేసింది. ఈ వేడుకల్లో పాల్గొనకూడదని నిర్ణయించింది. ఈ మేరకు కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, టాప్ క్యాడర్‌తో చర్చించిన అనంతరం తన నిర్ణయాన్ని వెల్లడించారు. దీనికి గల కారణాలను వివరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 22 పేజీల లేఖను రాశారు. ప్రజల జీవితాన్ని క్రమ క్రమంగా కల్లోలంలోకి నెట్టుతున్న రేవంత్ రెడ్డి సారథ్యం లోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పాలనతీరును నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిని ప్రదర్శించే అఖిలపక్ష సమావేశానికీ తమను ఆహ్వానించలేదని గుర్తు చేశారు. లోగోను మార్చడం అనేది ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికి అనుసరించే వ్యూహంగా అభివర్ణించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

**రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సంచలన లేఖ**





హైదరాబాద్ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బండి సంజయ్ లేఖ రాశారు. కాళేశ్వరం మాదిరిగానే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగకుండా అటకెక్కించే కుట్రలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేసిన సంజయ్, ఈ రెండు అంశాలపై విచారణ జరిగితే కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లక తప్పదని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఫోన్ ట్యాపింగ్ పై విచారణ జరగకుండా ఢిల్లీ స్థాయిలో ఒత్తిళ్లు చేస్తున్నారని ఆరోపించారు.

**ఫోన్ ట్యాపింగ్ కేసులో సీబీఐ విచారణ కోరుతున్నాం**

భారీ ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కారకులు కేసీఆర్, కేటీఆర్ లకు నోటీసులిచ్చి విచారిస్తే రాష్ట్ర దర్యాప్తుసంస్థల విశ్వసనీయత పెరిగేదని, ఆ పని చేయక పోవడంవల్లే సీబీఐ విచారణ కోరుతున్నామన్నారు బండి సంజయ్. ఫోన్ ట్యాపింగ్ అత్యంత తీవ్రమైన నేరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రసాదించిన హక్కులను కూడా ఫోన్ ట్యాపింగ్ తో కాలరాశారని నిప్పులు చెరిగారు. ఫోన్ ట్యాపింగ్ తో చేసిన దారుణాలపై బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ తో వ్యాపారులు, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు సహా పలువురు సెలబ్రిటీలను బెదిరించి డబ్బులు వసూలు చేయడంతోపాటు తమ అవసరాలను తీర్చుకున్నారని ఆరోపించారు. భార్యాభర్తలు మాట్లాడుకునే అంశాలను కూడా ట్యాపింగ్ చేసి వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడ్డారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కోసం విదేశాల నుండి ప్రత్యేకంగా పరికరాలు తెప్పించారన్నారు.

**ఫోన్ ట్యాపింగ్ ప్రధాన సూత్రధారి ప్రభాకర్ రావును ఎందుకు రప్పించలేదు**

బీఆర్ఎస్ ఓడిపోయాక ఫోన్ ట్యాపింగ్ పరికరాల ధ్వంసం పేరుతో దేశ భద్రతకు, ఉగ్రవాదులకు సంబంధించిన కీలకమైన సమాచార డేటాను కూడా ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపార సంస్థలు ప్రతిపక్షాలకు విరాళాలు ఇవ్వకుండా ఫోన్ ట్యాపింగ్ ను వాడుకున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన సూత్రధారి ప్రభాకర్ రావు అమెరికాలో తలదాచుకున్నా ఎందుకు స్వదేశానికి రప్పించలేకపోయారో చెప్పాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కేంద్ర దర్యాప్తు సంస్థల జోక్యం కోరుతూ లేఖ రాయాలి ఫోన్ ట్యాపింగ్ పై వాస్తవాలు నిగ్గు తేలాలంటే సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు జోక్యం అనివార్యం అని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి సీబీఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాయాలని తన లేఖలో బండి సంజయ్ డిమాండ్ చేశారు. అంతేకాదుతెలంగాణ శాసనసభా నాయకుడిగా ఉన్న మీరు కేసీఆర్, కేటీఆర్ లను అనర్హులుగా ప్రకటించే విషయంపై స్పీకర్ కు లేఖ రాయండి అని పేర్కొన్నారు.



## మరో నెల రోజులు జైలు లోనే కవిత..!

- ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితపై ఆరోపణలు
- మార్చి 15న హైదరాబాద్‌లో అరెస్ట్
- ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ
- బెయిలు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్
- నేటి నుంచి ఈ నెల 29 వరకు కోర్టుకు వేసవి సెలవులు
- వచ్చే నెల మొదటి వారంలో బెయిలు పిటిషన్‌పై తీర్పు!

హైదరాబాద్ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరో నెల రోజులు జైలులో ఉండడం అనివార్యంగా కనిపిస్తోంది. ఈ కేసులో మార్చి 15న కవిత అరెస్టయ్యారు. తీహార్ జైలులో ఉండగానే సీబీఐ మరోమారు అరెస్ట్ చేసింది. బెయిలు కోసం ఆమె ప్రయత్నించిన ప్రతిసారీ నిరాశే ఎదురవుతోంది. కుమారుడికి పరీక్షలు ఉన్నాయని, మధ్యంతర బెయిలు ఇవ్వాలన్న అభ్యర్థనను కూడా రౌస్ ఎవెన్యూ కోర్టు తోసిపుచ్చింది. బెయిలు కోసం కవిత పెట్టుకున్న పిటిషన్‌పై మే 27, 28న వాదనలు జరగ్గా తీర్పును కోర్టు రిజర్వు చేసింది.

**ఈ నెలంతా సెలవులే**

బెయిలుపై తీర్పును కోర్టు రిజర్వు చేయడంతో కవిత మరో నెల రోజులు జైలులో ఉండక తప్పని పరిస్థితి నెలకొంది. నేటి నుంచి ఈ నెల 29 వరకు కోర్టుకు వేసవి సెలవులు కావడంతో రిజర్వు చేసిన తీర్పు వెలువడే అవకాశం లేదు. కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావు నిన్న బెయిలు పిటిషన్ అంశాన్ని కోర్టులో లేవనెత్తినప్పటికీ కేసు లిస్టు కాలేదని రిజిస్ట్రార్ తెలియజేశారు. దీంతో కోర్టు సెలవులు ముగిశాక కానీ బెయిలుపై తీర్పు వెలువడే అవకాశం లేకుండా పోయింది. జూన్ 30 ఆదివారం కావడంతో జులై మొదటి వారంలోనే కవిత బెయిలు పిటిషన్‌పై తీర్పు వెలువడే అవకాశం ఉంది. మరోవైపు, ఈ నెల 3తో కవిత జుడీషియల్ కస్టడీ ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఆమె కస్టడీని మరోమారు పొడిగించాలని దర్యాప్తు సంస్థలు కోరే అవకాశం ఉంది.

## 4న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం

**సీఈవో వికాస్ రాజ్**



హైదరాబాద్ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

రాష్ట్రంలో జూన్4న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలంగాణ సీఈవో వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రత ఉంటుందని వికాస్ రాజ్ తెలిపారు. మొదటగా 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుందని సీఈవో వికాస్ రాజ్ వివరించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ ఏజెంట్ల వద్ద, సిబ్బంది వద్ద కూడా సెల్‌ఫోన్లు ఉండవని చెప్పారు.

కౌంటింగ్ కేంద్రంలో ప్రతి మూల కవర్ చేసేలా సీసీ కెమెరాల నిఘా ఉంటుందని తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి లెక్కింపు కేంద్రం వరకు, బారికేడ్లు, పటిష్ఠ భద్రత ఉంటుందన్నారు సీఈవో వికాస్ రాజ్.

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు 2.17 లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 276 టేబుళ్లు ప్రత్యేకంగా ఉంటాయన్నారు. మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యధికంగా 24 రౌండ్లలో లెక్కింపు ఉంటుందన్నారు. అత్యల్పంగా 13 రౌండ్ల లెక్కింపు ఉంటుందని సీఈవో వికాస్‌రాజ్ వెల్లడించారు. సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు సిబ్బందిని ర్యాండమ్‌గా కేటాయిస్తామని చెప్పారు. లెక్కింపు రోజు(జూన్ 4) ఉదయం 5 గంటలకు మరోసారి ర్యాండమ్‌గా సిబ్బందిని కేటాయిస్తామని సీఈవో తెలిపారు. 2400కు పైగా మైక్రో అబ్జర్వర్లు ఉంటారని సీఈవో వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపులో దాదాపు 10 వేల మంది సిబ్బంది పాల్గొంటారన్నారని సీఈవో తెలిపారు. కాగా, శనివారం తుది దశ పోలింగ్ ముగిస్తుండటంతో.. ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం సిద్ధమైంది.

## తెలంగాణకు ఐదు రోజుల పాటు భారీవర్షాలు

హైదరాబాద్ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

తీవ్రమైన ఎండలు, వడగాలులు, ఉక్కపోతతో సతమతమవుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. నేటి నుంచి (ఆదివారం)నుంచి రాగల ఐదు రోజుల పాటు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే జూన్ 3వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపి తగ్గి వాతావరణం చల్లబడుతుందని స్పష్టం చేసింది. ఆదివారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులు, 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని తెలిపింది. హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో వానలు పడే సూచనలున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మే 30న రుతుపవనాలు కేరళను తాకాయని జూన్ 5, 6 తేదీల్లో తెలంగాణ రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 44 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని కమాన్‌పూర్‌లో 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. కరీంనగర్ జిల్లాలో తీవ్రమైన ఎండలు, వడగాలుల ప్రభావంతో శుక్రవారం ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కాగా, శనివారం ఆదిలాబాద్, మంచిర్యాలలో 45 డిగ్రీలు కంటే ఎక్కువ ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. శనివారం కొన్ని జిల్లాల్లో సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

**ఆదివారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులు, 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది.**



## కేసు మూసివేతకు రూ. 3 లక్షల డిమాండ్

- లంచం తీసుకుంటూ దొరికిన కుషాయిగూడ సీఐ, ఎస్సై
- ఓ మహిళతో బాధితుడికి స్థల వివాదం
- ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు
- హైకోర్టును ఆశ్రయించిన బాధితుడు
- కేసు మూసివేసేందుకు లంచం డిమాండ్
- తీసుకుంటూ పట్టుబడిన మధ్యవర్తి
- అతడిచ్చిన సమాచారంతో సీఐ, ఎస్సై అరెస్ట్

హైదరాబాద్ ,జర్నలిస్ట్ ఫైల్ : నమోదైన కేసును మూసివేసేందుకు డబ్బులు డిమాండ్ చేసి రూ. 3 లక్షలు లంచం తీసుకుంటూ సీఐ, ఎస్సై, మరో వ్యక్తి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో జరిగిందీ ఘటన. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడలోని వాసవి శివనగర్ కాలనీలో స్థలం విషయంలో ఓ మహిళకు, స్థానికంగా నివసించే సింగిరెడ్డి భరత్‌రెడ్డికి మధ్య వివాదం నడుస్తోంది. మహిళ ఫిర్యాదుతో ఏప్రిల్‌లో భరత్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తనపై అన్యాయంగా కేసు నమోదు చేశారంటూ భరత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో 41 ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చిన పోలీసులు కేసు మూసివేసేందుకు రూ. 3 లక్షలు డిమాండ్ చేశారు. ఈ మొత్తంలో కొంత సీఐ జి. వీరస్వామికి ఇవ్వాల్సి ఉంటుందని ఎస్సై షేక్ షఫీ చెప్పారు. కుషాయిగూడకే చెందిన ఉపేందర్ ఈ విషయంలో మధ్యవర్తిగా వ్యవహరించాడు.

పోలీసుల తీరుపై భరత్ రెడ్డి ఏసీబీని ఆశ్రయించారు. నిన్న ఈసీఐఎల్‌లోని భరత్ ఆఫీసులో ఉపేందర్ రూ. 3 లక్షల నగదు తీసుకుంటుండగా మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, ఎస్సై షఫీ చెప్పడంతోనే తాను డబ్బు తీసుకున్నట్టు చెప్పడంతో ఏసీబీ అధికారులు వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రాత్రి వరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించారు.

# మోడీ ధ్యానం వెనుక పరమార్థం ఇదేనా..

**దేశంలో ఎన్నో ప్రాంతాలు ఉంటే.. మోడీ మాత్రం కన్యాకుమారిని ఎందుకు ఎంపిక చేసుకున్నారన్న విషయం వెనుక లెక్కలున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పుడు ప్రధాని మోడీ ఎక్కడైతే ధ్యానం చేస్తున్నారో.. 1892లో స్వామి వివేకానంద అక్కడే ధ్యానం చేశారు. అప్పట్లో స్వామి వివేకానందుడు ఒక రాయి మీద ధ్యానం చేశారు. మూడు రోజులు.. మూడు రాత్రుల పాటు ఆయన ధ్యానంలో్న్నారు. ఇక్కడ ధ్యానం చేసుకున్న తర్వాతే వివేకానందుడికి జ్ఞానోదయం అయిందని చెబుతారు. స్వామి వివేకానందుడు ధ్యానం చేసిన ప్రాంతాన్ని అందరికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 1963లో ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఏక్ నాత్ రనాదే ఒక స్మారక కట్టడాన్ని నిర్మించారు. అదే.. 'వివేకానంద రాక్ మెమోరియల్'.**

**న్యూఢిల్లీ స్పెషల్ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్**

నరాలు తెగే ఉత్కంఠ వేళ.. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయని అందరూ అదే పనిగా మాట్లాడుకుంటూ.. తమ అంచనాల్లో నిజమెంతన్న విషయాన్ని వేరే వారితో క్రాస్ చేసుకోవటం కనిపిస్తూ ఉంటుంది. ఇక.. రాజకీయ నేతల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. వీరి సంగతే ఇలా ఉంటే.. వారందరిని నడిపించే రాజకీయ అధినేతల సంగతేంటి? వారి మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది? వారి ఆలోచనలు ఎలా ఉంటాయన్న విషయాన్ని ఆలోచిస్తేనే.. వారెంత ఒత్తిడికి గురి అవుతుంటారో ఇట్టే అర్థమవుతుంది. ఏడు దశల్లో సుదీర్ఘంగా సాగిన ఎన్నికల ప్రక్రియలో కీలకమైన పోలింగ్ దశ పూర్తి కావటంతో పాటు ఈ రోజు సాయంత్రం ఆరున్నర గంటల వేళలో జాతీయ మీడియా సంస్థలన్నీ తమ ఎగ్జిట్ పోల్స్ ను వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇలాంటి వేళలో.. వీటన్నింటికి దూరంగా దాదాపు 48 గంటల పాటు ధ్యానంలో ఉండేందుకు వీలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్ణయం తీసుకోవటం.. అందుకు తమిళనాడులోని ప్రసిద్ధ కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ లో ధ్యానం చేసుకోనున్నట్లుగా పేర్కొని అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. అందరిలా వ్యవహరిస్తే ఆయన్ను నరేంద్ర మోడీ అని అనలేం. ఊహించని రీతిలో రియాక్టు కావటం ఆయనకు మొదట్నించి అలవాటే. ఇప్పుడు అదే ధోరణిని ప్రదర్శిస్తున్నారని చెప్పాలి. ఎన్నికల ఫలితాలపై యావత్ దేశమే కాదు.. అంతర్జాతీయంగా కూడా బోలెడంత ఆసక్తి వ్యక్తమవుతోంది.రెండు దఫాలుగా అధికారాన్ని నిలుపుకున్న మోడీ.. ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ ప్రధానమంత్రిగా అధికారాన్ని చేబట్టనున్నారా? ఆయన ఈసారి లక్ష్యంగా పెట్టుకున్న 400 ప్లస్ సీట్లను సాధిస్తున్నారా? కనీసం 370 మార్క్ను దాటతారా? అన్నది ఇప్పుడు ఇంట్రస్టింగ్ గా మారింది. మిగిలిన వారి మాదిరి తనకు ఎన్నికల ఫలితాల మీద ఎలాంటి ఆందోళన లేదని చెప్పిన ఆయన.. ఫలితాల వెల్లడి రోజున తాను టీవీ చూడనని.. ఫోన్ ను కూడా చెక్ చేయనని చెప్పారు. మరేం చేస్తారని అడిగితే.. ధ్యానం చేయనున్నట్లుగా పేర్కొనటంతో



అందరూ దాని గురించి మాట్లాడుకునేలా చేశారు. తన 48 గంటల నాన్ స్టాప్ ధ్యానానికి సంబంధించి ఆయన ఎంపిక చేసుకున్న వేదిక మీద ఇప్పుడు ఆసక్తికర చర్చ జరుగుతోంది. దేశంలో ఎన్నో ప్రాంతాలు ఉంటే.. మోడీ మాత్రం కన్యాకుమారిని ఎందుకు ఎంపిక చేసుకున్నారన్న విషయం వెనుక లెక్కలున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పుడు ప్రధాని మోడీ ఎక్కడైతే ధ్యానం చేస్తున్నారో.. 1892లో స్వామి వివేకానంద అక్కడే ధ్యానం చేశారు. అప్పట్లో స్వామి వివేకానందుడు ఒక రాయి మీద ధ్యానం చేశారు. మూడు రోజులు.. మూడు రాత్రుల పాటు ఆయన ధ్యానంలో్న్నారు. ఇక్కడ ధ్యానం చేసుకున్న తర్వాతే వివేకానందుడికి జ్ఞానోదయం అయిందని చెబుతారు. ఆయన తన సిద్ధాంతాలకు తుది రూపం తీసుకొచ్చింది కూడా ఇక్కడేనని చెబుతారు. స్వామి వివేకానందుడు ధ్యానం చేసిన ప్రాంతాన్ని అందరికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 1963లో ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఏక్ నాత్ రనాదే ఒక స్మారక కట్టడాన్ని నిర్మించారు. అదే.. 'వివేకానంద రాక్ మెమోరియల్'. 1970 నాటికి పూర్తైన ఈ నిర్మాణం ఇప్పటికే చక్కటి పర్యాటక ప్రాంతంగా పేరొందింది. అప్పటి రాష్ట్రపతి వీవీ గిరి దీన్ని ప్రారంభించారు. ఇంత స్పెషల్ అయిన ప్రాంతం కాబట్టే.. ప్రధానమంత్రి మోడీ ఇక్కడే ధ్యానం చేయాలని డిసైడ్ చేసినట్లుగా చెబుతారు. మోడీ విషయానికి వస్తే ఆయన సంఘ్ పరివార్ మూలాలే కాదు.. రామక్రిష్ణ మిషన్ లోనూ సభ్యుడన్న విషయాన్ని మర్చిపోకూడదు. తాను చేసుకునే ధ్యానం కోసం కన్యాకుమారిని ఎంపిక చేసుకోవటంలో రాజకీయంగా కూడా లెక్కలు ఉన్నాయని చెబుతారు. హ్యాట్రిక్ పీఎంగా పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి ఫోకస్ సౌత్ ఆపరేషన్ ను మరింత బలంగా చేపడతారని చెబుతున్నారు. మొత్తం 543 స్థానాలు ఉన్న లోక్ సభలో ఒక్క దక్షిణాదిలోనే 131 సీట్లు ఉండటం.. అందులో తమిళనాడులో అత్యధికంగా 39 ఎంపీ స్థానాలు ఉండటం తెలిసిందే. కరుణానిధి.. జయలలితల శకం ముగిసి.. పొలిటికల్ స్పేస్ ఎక్కువగా ఉన్న ఆ రాష్ట్రంలోకి తాము విజయవంతంగా అడుగు పెట్టగలిగితే.. పార్టీ ఫ్యూచర్కు మరింత మేలు జరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. తాను చేసే ధ్యానంతో కన్యాకుమారిని మరింత ఫేమస్ చేయటంతో పాటు.. రానున్న రోజుల్లో భారీ ఎత్తున దేశీయ.. విదేశీ పర్యాటకులు పోటెత్తటం ఖాయమని చెబుతున్నారు. మోడీ ఇమేజ్ తమిళులకు మరింత పాజిటివ్ గా తెలిసేలా చేయనున్నట్లు చెప్పాలి.

# భారత్‌కు యూకే నుంచి 100 టన్నుల బంగారం

**ముంబై:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరో కీలక చర్యకు ఉపక్రమించింది. యూకేలో నిల్వ చేసిన 100 మెట్రిక్ టన్నుల బంగారాన్ని ఆర్థిక సంవత్సరం 2024లో దేశీయ మార్కెట్‌లోకి ఆర్బీఐ తరలించింది. 1991లో 'విదేశీ మారక ద్రవ్య సంక్షోభం' నివారణకు పెద్ద మొత్తంలో బంగారాన్ని ఉపయోగించగా.. తిరిగి మళ్లీ ఇప్పుడే భారీ స్థాయిలో పసిడిని కేంద్ర బ్యాంక్ కదిలించింది. అయితే ఇంత బంగారాన్ని ఆర్బీఐ ఏం చేస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది.

కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అందుబాటులో ఉన్న నిల్వలను దేశీయంగా బంగారం ధరలను నియంత్రించేందుకు ఆర్బీఐ ఉపయోగించుకోవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా గోల్డ్ ఎక్స్చేంజ్-ట్రేడెడ్ ఫండ్స్ (జీఈటీఎఫ్) వంటి పెట్టుబడి సాధనాలకు అధిక డిమాండ్ ఏర్పడేలా చేయవచ్చునని పేర్కొంటున్నారు. అంతేకాదు.. దేశీయంగా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలు అందుబాటులో ఉంటే స్థానిక బులియన్ మార్కెట్‌ను బలోపేతం చేసేందుకు సాయపడుతుందని అంటున్నారు.



**ఆర్బీఐ వద్ద ఎంత బంగారం ఉంది?**

మార్చి 2024 నాటికి ఆర్బీఐ వద్ద మొత్తం 822.10 మెట్రిక్ టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వలు విదేశాల్లోనూ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇతర దేశాల మాదిరిగానే భారత్ కూడా 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్' వంటి ఇతర దేశాల బ్యాంకుల్లో పసిడిని భద్రపరిచింది. తాజాగా ఇంగ్లండ్ నుంచి 100 మెట్రిక్ టన్నుల బంగారాన్ని భారత మార్కెట్‌లోకి తరలించడంతో దేశీయ నిల్వ చేసిన బంగారం మొత్తం పరిమాణం 408 మెట్రిక్ టన్నులకు చేరింది. దీంతో దేశీయంగా, విదేశాల్లో ఉన్న బంగారం నిల్వలు దాదాపు సమానం అయ్యాయి. భారత్‌లో నిల్వ ఉంచిన బంగారంలో 308 మెట్రిక్ టన్నులను నోట్ల జారీ కోసం, మరో 100.28 టన్నుల పసిడి దేశీయ బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ ఆస్తిగా ఉన్నాయని గురువారం ఆర్బీఐ విడుదల చేసిన వార్షిక నివేదిక పేర్కొంది. ఇక విదేశాల్లో మొత్తం 413.79 మెట్రిక్ టన్నుల పసిడి నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది.

**ఆర్బీఐ బంగారాన్ని విదేశాల్లో ఎందుకు నిల్వ చేస్తుంది?**

కేంద్ర బ్యాంక్ ఆర్బీఐ విదేశాల్లో బంగారాన్ని నిల్వచేయడానికి పలు కారణాలు ఉన్నాయి. చారిత్రాత్మకంగా చూసుకుంటే.. 1990-91లో విదేశీ మారకద్రవ్య సంక్షోభం నివారణకు భారత్ తన బంగారం నిల్వల్లో కొంత భాగాన్ని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్'కు తాకట్టు పెట్టి 405 మిలియన్ డాలర్ల రుణాన్ని తీసుకుంది. అయితే ఈ రుణాన్ని నవంబర్ 1991 నాటికి తిరిగి చెల్లించింది. అయితే అప్పటి రవాణా కారణాల రీత్యా బంగారాన్ని భారత్‌కు తరలించేందుకు ఆర్బీఐ వెనకడుగు వేసింది. దీంతో యూకేలోనే ఉంచాలని నిర్ణయించింది. మరోవైపు విదేశాలలో నిల్వ చేసిన బంగారాన్ని సులభంగా ట్రేడింగ్ చేసుకునే అవకాశం ఉండడం, ఎక్స్ఛేంజ్‌లు, లాభాల స్వీకరణ కూడా సులభంగా ఉండడంతో అప్పట్లో ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. దాంతో అప్పటినుంచి అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బంగారాన్ని కొనుగోలు చేసి విదేశాలలోనే నిల్వ చేయడం మొదలుపెట్టింది.

అయితే విదేశాలలో బంగారాన్ని నిల్వ చేయడం ప్రమాదకరమనే విషయాన్ని ఆర్బీఐ ఇటీవలే గుర్తించింది. ముఖ్యంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల సమయంలో విదేశాల్లో బంగారం నిల్వలు అంత క్షేమం కాదని భావించింది. ఇటీవల ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో పాశ్చాత్య దేశాలు తమ బ్యాంకుల్లో నిల్వ ఉన్న రష్యన్ ఆస్తులను స్తంభింపజేయడాన్ని ఆర్బీఐ క్షుణ్ణంగా గమనించింది. విదేశాలలో నిల్వ ఉన్న ఆస్తుల భద్రతపై ఆందోళన చెందిన ఆర్బీఐ.. యూకే నుంచి బంగారాన్ని స్వదేశానికి తరలించేందుకు నిర్ణయం తీసుకుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# నాగపూర్ లో నమోదైన ఉష్ణోగ్రత 56 డిగ్రీలు కాదన్న ఐఎండీ

**నాగపూర్ :** గత కొన్ని రోజులుగా దేశంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిన్న మహారాష్ట్రలోని నాగపూర్ లో రికార్డు స్థాయిలో 56 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు వార్తలు వచ్చాయి. దీనిపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వివరణ ఇచ్చింది. నాగపూర్ లో నమోదైంది 56 డిగ్రీలు కాదని స్పష్టం చేసింది. అక్కడ ఏర్పాటు చేసిన వాతావరణ సెన్సర్లు సరిగా పనిచేయకపోవడం వల్లే ఈ పొరపాటు జరిగిందని ఐఎండీ వెల్లడించింది. నాగపూర్‌లో తాము నాలుగు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్ (ఏడబ్ల్యూఎస్)ను ఏర్పాటు చేశామని, అందులో ఒకటి 56 డిగ్రీలు చూపించగా, మరొకటి 54 డిగ్రీల ఉష్ణోగ్రతను చూపించిందని, కానీ మరో రెండు ఏడబ్ల్యూఎస్ లలో 44, 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చూపించాయని ఐఎండి వివరణ ఇచ్చింది. ఈ ఎలక్ట్రానిక్ సెన్సర్లు ఒక్కోసారి ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఉష్ణోగ్రతలను తప్పుగా చూపిస్తుంటాయని, నాగపూర్ లోనూ అదే జరిగిందని... ఒక వెదర్ స్టేషన్ లో 56, మరో వెదర్ స్టేషన్ లో 54 డిగ్రీలు నమోదైందని తెలిపింది.

# భారత్ జీడీపీ వృద్ధిరేటు సూపర్

**న్యూఢిల్లీ :** దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కీలకమైన జీడీపీ గణాంకాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారత్ జీడీపీ వృద్ధి 8.2 శాతానికి చేరుకుందని ప్రకటించారు. ఇది వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు సూచనగా ఆయన పేర్కొన్నారు. వృద్ధి రేటు మునుపటి అంచనాలను మించిపోయిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ జీడీపీ 7 శాతం వృద్ధితో పోలిస్తే మెరుగైన వృద్ధి సాధించినట్లు తెలిపారు.

**ఇది ట్రైలర్ మాత్రమేనంటూ ప్రధాని మోదీ ప్రశంసలు**

భారత జీడీపీ వృద్ధిపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. 2023-24 క్యూ4 జీడీపీ వృద్ధి డేటా మన ఆర్థిక వ్యవస్థలో బలమైన ఊపును చూపుతోంది. ఇది మరింత వేగవంతం కావడానికి సిద్ధంగా ఉంది. మన దేశంలోని కష్టపడి పనిచేసే ప్రజలకు ధన్యవాదాలు. 2023-24 సంవత్సరానికి 8.2 శాతం వృద్ధి అనేది ప్రపంచవ్యాప్తంగా భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని నేను చెప్పినట్లు జరిగింది. ఇది రాబోయే విషయాల ట్రైలర్ మాత్రమే అంటూ ప్రధాని ట్వీట్ చేశారు.



**త్రైమాసిక, వార్షిక వృద్ధి ఇలా..**

2023-24 నాలుగో త్రైమాసికంలో భారతదేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధి రేటును ప్రతిబింబిస్తూ రూ. 47.24 లక్షల కోట్లకు పెరిగింది. గత త్రైమాసికంలో (జనవరి-మార్చి) జీడీపీ 7.8 శాతంతో స్వల్పంగా మందగించినప్పటికీ, వివిధ రంగాల్లో బలమైన వృద్ధితో ఆర్థిక వ్యవస్థ స్థిరంగా మంచి పనితీరు కనబరిచింది. ఈ గణనీయమైన వృద్ధి భారత ఆర్థిక వ్యవస్థను 3.5 ట్రిలియన్ డాలర్లకు పెంచింది. రాబోయే సంవత్సరాల్లో 5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని సాధించడానికి వేదికను ఏర్పాటు చేసింది.

**వివిధ రంగాల వారీగా గణాంకాలు..**

తయారీ రంగం ప్రోత్సాహకర వృద్ధి నమోదు చేయడంతో మెరుగైన జీడీపీ గణాంకాలు సాధ్యమయ్యాయి. 2023-24లో తయారీ రంగం ఏకంగా 8.9 శాతం వృద్ధి చెందింది. ఇక చివరి క్వార్టర్‌లోనూ భారత జీడీపీ 7.8 శాతంతో సత్తా చాటింది.

అయితే వ్యవసాయ రంగం వృద్ధి 0.6 శాతానికి క్షీణించింది. సేవల రంగ వృద్ధి మిశ్రమంగా ఉంది. అటు ఆర్థిక, రియల్ ఎస్టేట్ సేవలు 7.6 శాతం వృద్ధిని సాధించాయి. అలాగే వాణిజ్యం, ఆతిథ్యం 5.1 శాతం పెరిగింది.

# సల్మాన్ ఖాన్ హత్యకు పాక్ నుంచి ఏకే 47 తుపాకులు..

**హీరో కదలికలపై 15-20 మందితో నిఘా**

**పన్వేల్‌లోని ఫాంహౌస్ వద్ద బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుల తిష్ట**

**సల్మాన్ కారును చుట్టుముట్టి కాల్పులు జరిపేందుకు ప్రణాళిక**

**ముంబై :** బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ ను అంతమొందిస్తామని ప్రతిజ్ఞ చేసిన బిష్ణోయ్ గ్యాంగ్.. ఆ దిశగా భారీ ప్రణాళికలే వేసినట్లు తాజాగా బయటపడింది. సల్మాన్ కదలికలపై నిరంతరం నిఘా వేయడంతో పాటు ఆయన కారును చుట్టుముట్టి కాల్పులు జరపాలని ప్లాన్ చేసినట్లు పోలీసుల పరిశోధనలో బయటపడింది. ఇందుకోసం పాకిస్థాన్ నుంచి ఏకే 47 సహా పలు ఆయుధాలను కొనుగోలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పాక్ కు చెందిన ఓ ఆయుధాల సప్లయర్ నుంచి ఏకే 47, ఎం 16, ఏకే 92, హై కాలిబర్ ఆయుధాలను తెప్పించినట్లు పేర్కొన్నారు.

బాంద్రాలోని సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటన ఇటీవల సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు పలు సంచలన విషయాలు తెలిశాయని సమాచారం. ఈ కాల్పుల ఘటన కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని బిష్ణోయ్ గ్యాంగ్ లీడర్ లారెన్స్ బిష్ణోయ్ హెచ్చరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కాల్పుల కేసును లోతుగా దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో ఇద్దరు అనుమానితులను ప్రశ్నించగా.. సల్మాన్ ను హత్య చేయడానికి బిష్ణోయ్ గ్యాంగ్ భారీ ప్రణాళిక రచించినట్లు బయటపడింది.

ముంబైలోని బాంద్రాలో ఉన్న సల్మాన్ నివాసంతో పాటు పన్వేల్ లోని ఆయన ఫాంహౌస్ వద్ద బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు నిఘా పెట్టారని పోలీసులు తెలిపారు. హీరో కదలికలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఏకంగా పాతిక మంది వరకు ఫాంహౌస్ సమీపంలో తిష్ట వేశారని చెప్పారు. కాగా, రాజస్థాన్‌లో కృష్ణజింకలను వేటాడి చంపిన కేసులో సల్మాన్ ఖాన్ పేరు బయటకు వచ్చిన నాటి నుంచి బిష్ణోయ్ గ్యాంగ్ ఆయనను టార్గెట్ చేసింది.





## జాతీయ వార్తలు



# ఈవీఎంలను ఎత్తుకెళ్లి నీటి కుంటలో పడేసిన గ్రామస్తులు

**పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత**

**గ్రామస్తులు ఎత్తుకెళ్లిన ఈవీఎంలు అదనంగా ఏర్పాటు చేసినవేనన్న ఈసీ**

**పోలింగ్ యాథావిధిగా జరుగుతోందని వివరణ**

**రాష్ట్రంలో అక్కడక్కడా ఉద్రిక్తతలు**

**కోల్‌కతా:** లోక్ సభ ఎన్నికల్లో భాగంగా శనివారం ఆఖరి దశ పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్ లోని పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. రాజధాని కోల్ కతాకు సమీపంలోని జాదవ్ పూర్ నియోజకవర్గంలో సీపీఎం, ఐఎస్ఎఫ్ నేతలు, కార్యకర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఓ పోలింగ్ బూత్ లోకి చొరబడిన జనం.. ఈవీఎంతో పాటు ఎన్నికల సామాగ్రిని ఎత్తుకెళ్లి దగ్గర్లోని నీటి కుంటలో పడేశారు. భాన్ గర్ నియోజకవర్గంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. ఏఐఎస్ఎఫ్ అభ్యర్థికి చెందిన వాహనాన్ని టీఎంసీ కార్యకర్తలు ధ్వంసం చేశారు.

దక్షిణ 24 పరగణాల జిల్లా జయ్ నగర్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని కుల్తాలీలో పోలింగ్ సందర్భంగా అల్లర్లు చెలరేగాయి. తమ ఏజెంట్లను పోలింగ్ బూత్ లోకి అనుమతించట్లేదని ఓ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. మూకుమ్మడిగా పోలింగ్ బూత్ లోకి చొరబడి ఎన్నికల సామాగ్రిని చెల్లాచెదురు చేశారు. ఓ ఈవీఎంతో పాటు వీవీప్యాట్ మెషిన్లను ఎత్తుకెళ్లారు. వాటిని దగ్గర్లోని ఓ నీటి కుంటలో పడేశారు. పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులు వారిని చెదరగొట్టారు. నీటిలో పడేసిన ఎన్నికల సామాగ్రిని వెలికితీశారు. అయితే, కుల్తాలీలో ముందు జాగ్రత్త చర్యగా అదనంగా ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీప్యాట్లనే నీటి కుంటలో పడేశారని ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. కుల్తాలీ పోలింగ్ బూత్ లో పోలింగ్ యథావిధిగా జరుగుతోందని స్పష్టం చేసింది. సెక్టార్ ఆఫీసర్ కు మరో ఈవీఎంను అందజేసినట్లు తెలిపింది. ఈ ఘటనపై కుల్తాలీ సెక్టార్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారని పేర్కొంది. పోలింగ్ బూత్ వద్ద అదనపు బలగాలను ఏర్పాటు చేసినట్లు వివరించింది.

**పూణె ప్రమాదం..**

# బాలుడి తల్లి అరెస్టు

- బాలుడి బ్లడ్ శాంపిల్స్ స్థానంలో తన రక్తం ఇచ్చిన తల్లి
- విచారణలో విషయం బయటపడడంతో అరెస్ట్
- బాలుడి తండ్రి, తాతలను కస్టడీకి పంపిన కోర్టు



**పూణె :** ఒక్క ప్రమాదం ఆ కుటుంబం మొత్తాన్నీ జైలుపాలు చేసింది.. పరీక్షల్లో పాస్ అయిన సందర్భంగా మద్యం తాగి కారు నడిపిన పూణె బాలుడు యాక్సిడెంట్ చేసిన విషయం తెలిసిందే. ఈ యాక్సిడెంట్ లో ఇద్దరు టెకీలు అక్కడికక్కడే మరణించారు. అయితే, ప్రమాదం జరిగిందనే బాధ కానీ, ఇద్దరు చనిపోయారనే పశ్చాత్తాపం కానీ లేకుండా కొడుకును కేసు నుంచి తప్పించేందుకు ఆ బాలుడి కుటుంబం ప్రయత్నించింది. అదికాస్తా బెడిసికొట్టడంతో ఒకరి తర్వాత ఒకరుగా తల్లి, తండ్రి, తాతలు కటకటాల వెనక్కి చేరారు.

పూణె కార్ యాక్సిడెంట్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా బాలుడి తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద సమయంలో బాలుడు మద్యం మత్తులో ఉన్నాడని ఇప్పటికే పోలీసులు ఆధారాలు సేకరించారు. అయితే, బాలుడికి రక్త పరీక్ష నిర్వహించేందుకు సేకరించిన శాంపిల్స్ ను వైద్యుల సాయంతో బాలుడి తండ్రి మార్చేశాడు. బాలుడి రక్త నమూనాల స్థానంలో బాలుడి తల్లి నమూనాలు చేర్చారు. ఈ కేసు తీవ్ర సంచలనంగా మారడంతో ఉన్నతాధికారులు బాలుడికి రెండుచోట్ల రక్త పరీక్ష నిర్వహించారు.

ఒకచోట బాలుడి రక్తంలో మద్యం ఆనవాళ్లు లేవని, మరోచోట ఉన్నాయని రిపోర్టు వచ్చింది. దీంతో ఏం జరిగిందని పరిశోధించగా.. బాలుడి రక్త నమూనాలను మార్చిన విషయం బయటపడింది. ఈ నిర్వాకానికి పాల్పడిన వైద్యులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వైద్యులు ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే కొడుకును తప్పించేందుకు తన రక్తం ఇచ్చిన బాలుడి తల్లిని తాజాగా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# సెక్స్ స్కాండల్ కేసులో భవానీకి నో బెయిల్

**బెంగళూరు :** హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ కేసు రోజుకొక మలుపు తిరుగుతోంది. ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల వీడియోలు లీక్ కావడంతో కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా ఆయన కేసు ప్రతిరోజు వార్తల్లో ఉంటోంది. కర్ణాటకలో జరిగిన లోక్ సభ ఎన్నికల ప్రచారం కంటే ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల వీడియో కేసు కన్నడ మీడియాలో ఎక్కువ వచ్చింది. ప్రజ్వల్ రేవణ్ణ కేసుతో ఇప్పుడు ఆయన తల్లి భవానీ రేవణ్ణ ఇబ్బందుల్లో కూరుకుపోయారు. సుమారు 35 రోజులుగా పరారీలో ఉన్న హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను గురువారం అర్ధరాత్రి సిట్ అధికారులు బెంగళూరులోని కంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. ప్రజ్వల్ రేవణ్ణను ఆరు రోజుల పాటు సిట్ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తల్లి, ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ భార్య భవానీ రేవణ్ణ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తోసిపుచ్చింది. మైసూరు జిల్లా కేఆర్ నగరంలో మహిళ అపహరణ కేసులో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కోడలు భవానీ రేవణ్ణ బుధవారం ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ప్రత్యేక కోర్టుకు మనవి చేశారు. భవానీ రేవణ్ణ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సిట్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజ్వల్ రేవణ్ణ, హెచ్‌డీ రేవణ్ణలపై అత్యాచారం, లైంగిక వేధింపులు, కిడ్నాప్ కేసులను విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) భవానీ రేవణ్ణ ముందస్తు బెయిల్‌పై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇంటి పనిమనిషి అపహరణలో భవానీ రేవణ్ణ పాత్రపై విచారణ జరపాలని సిట్ కోర్టుకు చెప్పింది. భవానీ రేవణ్ణ, ఆమె కుటుంబ సభ్యులు చాలా ప్రభావవంతమైన నాయకులు అని, వాళ్లకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలను తారుమారు చేసి బాధితులను, సాక్షులను ప్రభావితం చేయగలరని సిట్ కోర్టుకు తెలిపింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు భవానీ రేవణ్ణకు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి తిరస్కరించింది. ప్రజ్వల్ రేవణ్ణను అరెస్టు చేసి జూన్ 6వ తేదీ వరకు కస్టడీకి తీసుకున్న సిట్ శనివారం హాసన్ జిల్లాలోని హాలేనరసీపురలో విచారణకు హాజరు కావాలని భవానీ రేవణ్ణకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం మీద ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల వీడియోల కేసులో ఇప్పటికే ఆయన తండ్రి, మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ జైలుకు వెళ్లి బెయిల్ మీద బయటకు వచ్చారు. ఇప్పుడు ప్రజ్వల్ రేవణ్ణ తల్లి భవానీ రేవణ్ణను కూడా విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు ఆదేశాలు జారీ చెయ్యడం హాట్ టాపిక్ అయ్యింది.



## తిరుమలలో ఐదురోజుల హనుమత్ జయంతి వేడుకలు షురూ!

**తిరుపతి, జర్నలిస్ట్ ఫైల్:** తెలుగు రాష్ట్రాల్లో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరుపుతున్నారు. జై హనుమాన్ నినాదాలతో హనుమాన్ భక్తులు ఆలయాలలో పూజలు నిర్వహిస్తున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం తిరుమలలో విశేష వేడుకలు జరిగాయి. దీనికి టీటీడి అన్ని ఏర్పాట్లు చేసింది. తిరుమలలో 5 రోజుల వేడుకలు మొత్తం ఐదు రోజులపాటు జరగనున్న వేడుకలలో తొలిరోజు అంటే శనివారం ఆకాశగంగలో శ్రీ బాలాంజనేయ స్వామి, శ్రీ అంజనాదేవికి ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించడంతోపాటు, జపాలి తీర్థంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. ఉదయం ఎనిమిదిన్నర గంటల నుండి 10 గంటల వరకు అభిషేకాన్ని నిర్వహించారు. మల్లెపూలతో హనుమాన్‌కు అభిషేకం చేశారు. ఆదివారం తమలపాకులతో, మూడవ తేదీన ఎర్రగన్నేరు, కనకాంబరాలతో, 4వ తేదీన చామంతితో, చివరి రోజైన జూన్ 5వ తేదీ సింధూరంతో అంజనాద్రి శ్రీ బాలాంజనేయ స్వామి స్వామివారికి అభిషేకం చేస్తారు. ఆంజనేయ సహస్రనామార్చనలతో పాటు అత్యంత ఘనంగా మంత్రోచ్ఛారణల మధ్య ఐదురోజుల హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం 10 గంటలకు ఆకాశగంగ వద్ద శ్రీ ఆంజనేయ జన్మ వృత్తాంతం పై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇక జపాలి లో ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల మధ్య దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా సామూహిక పారాయణాన్ని నిర్వహిస్తారు. శనివారం జపాలి లో హరికథ గానం చేశారు. ఆదివారం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంకీర్తనలు, జూన్ మూడవ తేదీన పురందరదాసు సంకీర్తనలు నిర్వహిస్తారు. అనేక సంగీత, నృత్య కార్యక్రమాలు జూన్ 4వ తేదీన హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారిచే భజన కార్యక్రమాలు, జూన్ 5వ తేదీన ప్రాజెక్టు కళాకారులచే హరికథాగానం నిర్వహిస్తారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుండి 5 గంటల మధ్య ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులచే నృత్య కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు .. అంతే కాదు హనుమాన్ జయంతి సందర్భంగా నాదనీరాజనం వేదికపై ప్రతిరోజు మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగు గంటల మధ్య శ్రీ హనుమాన్ జననం తో పాటు హనుమంతుడికి సంబంధించిన ఇతర ఆసక్తికర విషయాలపై ప్రముఖ వేద పండితులతో ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక హనుమాన్ జయంతి వేడుకలు ఐదు రోజులపాటు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసిన టీటీడి ఆ పనిలో నిమగ్నమైంది.




## పిన్నెల్లి పిటిషన్‌ను విచారించిన హైకోర్టు...

- సీఐ నారాయణస్వామిపై వేటు
- పల్నాడు జిల్లాలో పోలింగ్ రోజున అల్లర్లు
- సీఐ నారాయణస్వామి శాంతిభద్రతలు కాపాడడంలో విఫలమయ్యాడన్న పిన్నెల్లి
- పిన్నెల్లి పిటిషన్‌పై నేడు విచారణ చేపట్టిన ఏపీ

**అమరావతి , జర్నలిస్ట్ ఫైల్:** ఇటీవల పోలింగ్ నేపథ్యంలో కారంపూడి సీఐ నారాయణస్వామి తనపై తప్పుడు కేసులు నమోదు చేశాడంటూ మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. శాంతిభద్రతలు కాపాడడంలో సీఐ విఫలమయ్యాడని ఆరోపించారు. పిన్నెల్లి పిటిషన్ పై నేడు విచారణ చేపట్టి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సీఐ నారాయణస్వామిని విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఏపీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో, ఏపీ సీఈవో ముఖేశ్ కుమార్ మీనా సీఐ నారాయణస్వామిని విధుల నుంచి తప్పించారు. అంతేకాదు, సీఐపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ముఖేశ్ కుమార్ మీనా సిట్ విచారణకు ఆదేశించారు. నిర్దిష్ట ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఏ అధికారిపై అయినా విచారణ జరుపుతామని మీనా స్పష్టం చేశారు.


సీఐ నారాయణస్వామి(ఫైల్)

# రాష్ట్రంలోకి రుతుపవనాలు

### వేడి సెగల వేళ చల్లని కబురు

అమరావతి బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

ఏపీలో రెండు రోజులుగా వేడి సెగలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. రికార్డు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ రోజు అదే రకంగా వడ గాల్పులు ఉంటాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాల ప్రజలకు చల్లని కబురు అందించింది. తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాల ఆగమనం మొదలైంది. మరి కొద్ది గంటల్లోనే రాయలసీమలో రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. దీంతో, రేపటి నుంచి రాష్ట్రంలో వర్షాలు మొదలవుతాయని అంచనా వేస్తున్నారు. రుతుపవనాల ప్రవేశం తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. జూన్2న ఏపీలో.. జూన్ 10నుంచి తెలంగాణలో నైరుతి రుతుపవనాలు విస్తరిస్తాయని వాతావరణశాఖ తెలిపింది. రెండు, మూడు రోజుల్లో మరింత విస్తరించేందుకు అనుకూల అవకాశాలు ఉన్నాయంటూ విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. జూన్ 2 నుంచి ఏపీలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఏపీలో రెండు రోజుల పాటు పొడి వాతావరణం ఉంటుందని.. దక్షిణ కోస్తాలో వడగాలులు వీస్తాయని.. అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. రికార్డు ఉష్ణోగ్రతలు ఇప్పటికే కేరళ తీరాన్ని తాకిన నైరుతీ రుతుపవనాలు చాలా చురుగ్గా ముందుకు విస్తరిస్తున్నాయి. రుతుపవనాల ప్రభావంతో భారీ మేఘాలు కమ్ముకుని భారత భూభాగంలో అక్కడక్కడ భారీ వర్షాలు అందుకుంటున్నాయి. నైరుతి రుతుపవనాల కదలికతో ఏపీలో తొలకరి జల్లులు కురిసే అవకాశం ఉందని అంచనాలు వెల్లడించారు. మరో రెండు రోజుల్లో ఏపీలో




రుతుపవనాలు విస్తరించే ఛాన్స్ బలంగా ఉందని చెప్పారు వాతావరణశాఖ అధికారులు. అన్ని అనుకూలిస్తే.. జూన్ ఫస్ట్ వీక్‌లోనే రాయలసీమలోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నారు. కోస్తాలో వర్షాలు మరోవైపు తెలంగాణ రైతులకు హైదరాబాద్ వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. జూన్ 10లోగా నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. నైరుతి రుతుపవనాలు రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు, జూన్ 10 లోగా తెలంగాణకు రుతుపవనాలు చేరుకుంటాయని వాతావరణశాఖ అధికారి తెలిపారు. జూన్ 11 వరకు రాష్ట్రమంతటా విస్తరిస్తాయని వెల్లడించారు. జూన్ 1 నుంచి మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేరొన్నారు. రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్ల నమోదవుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలగనుంది.

# హెూటళ్లలో 'నో రూమ్స్' !

### కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాకేంద్రాల్లో రాజకీయ నాయకుల అనుచరుల హడావుడి

అమరావతి బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

కొన్ని నెలలుగా వేచి చూసిన క్షణాలు వచ్చేస్తున్న వేళ.. ఏపీవ్యాప్తంగా ఉన్న జిల్లా కేంద్రాల్లో ఇప్పుడు కొత్త సీన్ కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికలతో పాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు జరుగుతున్న ఎన్నికల్లో హైలెట్ గా నిలుస్తోంది ఆంధ్రప్రదేశ్. ఏపీలో ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్న దానిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. యావత్ దేశం చూపు ఏపీ మీద ఉంది. గడిచిన కొంతకాలంగా చోటు చేసుకున్న పరిణామాలతో ఏపీ ఎన్నికల ప్రక్రియతో పాటు.. తుది ఫలితం మీదా ఆసక్తి వ్యక్తమవుతోంది. ఏపీవ్యాప్తంగా ఉన్న జిల్లా కేంద్రాల్లో ఇప్పుడు కొత్త సీన్ కనిపిస్తోంది. ఎక్కడైతే ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందో.. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని హెూటళ్లు.. లాడ్జిలు ఫుల్ అయిపోయిన పరిస్థితి. హెూటళ్లలోని రూంల్ని పొలిటికల్ పార్టీల నేతలు పోటాపోటీగా బుక్ చేసేశారు. హెూటళ్లలో రూంల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో.. ఇప్పుడు బంధువులు.. తెలిసిన వారి ఇళ్లకు వెళుతున్న పరిస్థితి. దీంతో.. ముఖ్యంగా జిల్లా కేంద్రాల్లోని పట్టణాలు మొత్తం జిల్లాలోని వివిద పార్టీల నేతలు.. వారి అనుచర గణంతో కళకళలాడుతోంది. జిల్లా వ్యాప్తంగా వచ్చే వారి వాహనాలతో రోడ్లు రద్దీగా ఉంటున్నాయి. ఓట్ల లెక్కింపును గతానికి భిన్నంగా అధికార.. విపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవటం.. ప్రత్యేక వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటున్న పరిస్థితి. దీంతో.. అవసరానికి మించిన అనుచర గణాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే



రోజున నెలకొనే అన్ని పరిస్థితులకు సిద్ధమయ్యేలా పార్టీలు వ్యవహరిస్తున్నాయి. దీంతో.. రోటీన్ గా అవసరమయ్యేదానికి రెట్టింపు బలాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. వీరందరి బసకు భారీ ఎత్తున డిమాండ్ నెలకొంది. అయితే.. ఏపీ వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లోని పెద్ద హెూటళ్ల నుంచి చిన్న లాడ్జిల వరకు ఫుల్ అయిపోయిన పరిస్థితి. ఆసక్తికరమైన విషయం ఏమంటే.. ఈసారి నెల ముందే బుకింగ్ లు అయిపోయినట్లుగా కొన్ని జిల్లా కేంద్రాలకు చెందిన హెూటల్ యజమానులు చెబుతున్నారు.

# పెళ్లి కళ వచ్చేసిందే బాలా..

- పెళ్లిళ్ల సీజన్ మొదలు
- జూన్, జులైలలో సుముహూర్తాలు
- ఈ నెలాఖరులో మొదలువుతున్న శుభ ఘడియలు
- వచ్చే నెల ప్రారంభంలో మంచి రోజులు
- మూఢం, శూన్య మాసం కారణంగా నిలిచిన వివాహాలు

అమరావతి బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

మూఢం, శూన్య మాసం కారణంగా కొన్ని రోజులుగా శుభకార్యాల సందడి ఎక్కడా కనిపించడంలేదు.. అయితే, ఈ నెలాఖరున మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. వచ్చే నెల ప్రారంభంలోనూ పెళ్లి ముహూర్తాలు ఉన్నాయని తెలిపారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో పెళ్లిళ్ల సందడి మొదలుకానుంది. ఆహ్వాన పత్రికలు, భాజాభజంత్రీల చప్పుళ్ల హెూరెత్తిపోనున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 11 నుంచి ఏప్రిల్ 26 వరకు వివాహాలతో పాటు పలు శుభకార్యాలు జరిగాయి. ఆ తర్వాత మూఢం రావడంతో చాలామంది శుభకార్యాలను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు మంచి రోజులు



రావడంతో వివాహాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పండితులు చెప్పిన వివరాల ప్రకారం ఈ నెలాఖరు నుంచి శుభ ఘడియలు మొదలు కానున్నాయి. మాఘ, ఉత్తర ఫాల్గుణి, హస్త, స్వాతి నక్షత్రాల వేళ శుభ ముహూర్తాలు ఉన్నాయని, వివాహాది శుభకార్యాలకు మంచి ముహూర్తాలని పండితులు చెప్పారు. ఈ ముహూర్తాలు దాటితే చాతుర్మాసం కారణంగా ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు మంచి ముహూర్తాలు లేవని వివరించారు. ఆ తర్వాత మళ్లీ డిసెంబర్ నెలలోనే శుభకార్యాలకు ముహూర్తాలు ఉన్నాయని పేర్కొన్నారు.

**శుభ ముహూర్తాలు ఇవే..**

జూన్ 29 శనివారం, జులై 9 మంగళవారం, జులై 11 గురువారం, జులై 12 శుక్రవారం, జులై 13 శనివారం, జులై 14 ఆదివారం, జులై 15 సోమవారం




## రాష్ట్రానికి తిరిగొచ్చిన జగన్

### గన్నవరంలో ఘన స్వాగతం

విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్

గన్నవరం విమానాశ్రయం దగ్గర సీఎం జగన్ కు నాయకులు, కార్యకర్తల నుంచి ఘన స్వాగతం లభించింది. ఏపీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం చిన్నపాటి విశ్రాంతి నిమిత్తం అని కొంతమంది నాయకులు, వైద్య పరీక్షల నిమిత్తం అని ఇంకొంతమంది నేతలు వివిధ ప్రాంతాలకూ వెళ్లిన సంగతి తెలిసిందే! ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి విదేశీ పర్యటనకు వెళ్లిన ఏపీ సీఎం వైఎస్ జగన్ తన పర్యటన ముగించుకుని ఏపీకి వచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విదేశీ పర్యటన ముగిసింది. ఈ క్రమంలో... శనివారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో సహా రాష్ట్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గన్నవరం విమానాశ్రయం దగ్గర సీఎం జగన్ కు నాయకులు, కార్యకర్తల నుంచి ఘన స్వాగతం లభించింది. ఇందులో భాగంగా... ఎంపీ విజయసాయిరెడ్డి నేతృత్వంలో పలువురు ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ కీలక నేతలు సీఎం జగన్ కు స్వాగతం పలికారు. ఇదే సమయంలో పార్టీ కార్యకర్తలూ పెద్ద ఎత్తున తరలివచ్చారు. అక్కడి నుంచి ఆయన నేరుగా తాడేపల్లి నివాసానికి చేరుకున్నారు. కాగా... ఏపీలో మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత మే 17వ తేదీన సీఎం జగన్ విదేశీ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా లండన్, స్విట్జర్లాండ్ దేశాల్లో కుటుంబ సమేతంగా ఆయన పర్యటించారు. ఈ క్రమంలో పదిహేను రోజుల తర్వాత తిరిగి నేడు స్వదేశానికి విచ్చేశారు. ఇక జూన్ 4వ తేదీన ఏపీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడో, రేపో ఓట్ల లెక్కింపు రోజు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంలో వైసీపీ శ్రేణులకు సీఎం జగన్ దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని తెలుస్తుంది.



## డయేరియా మరణాలు విచారకరం

### చంద్రబాబు ఆవేదన

- విజయవాడలో డయేరియాతో వారం రోజుల వ్యవధిలో 9 మంది మృతి
- బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంపై చంద్రబాబు ఆందోళన
- ప్రభుత్వ యంత్రాంగం వెంటనే సమస్యపై దృష్టిపెట్టాలన్న టీడీపీ అధినేత

**విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్ :** విజయవాడలో డయేరియాతో వారం రోజుల వ్యవధిలో 9 మంది చనిపోవడంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత నీరు సరఫరా కారణంగానే ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. డయేరియాతో కాకుండా ఇతర అనారోగ్య కారణాలతో వీరంతా చనిపోయారని అధికారులు చెప్పడం సరికాదని అన్నారు. కలుషిత నీటిపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలని తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ అధినేత ప్రభుత్వాన్ని కోరారు.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

**తిరుమల, జర్నలిస్ట్ ఫైల్ :** తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. వీకెండ్ సెలవు దినాలు కావడంతో శ్రీవెంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కొండపై ఉన్న అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. దీంతో ప్రస్తుతం భక్తులు శిలాతోరణం వరకు వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనం కోసం 24 గంటల నుంచి 30 గంటల వరకు సమయం పడుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. కాగా, శుక్రవారం స్వామివారిని 67,873 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 33,532 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. అలాగే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా స్వామివారి హుండీకి రూ. 3.93 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.

## పవన్ గెలుపు కోసం.. మోకాళ్లపై తిరుపతి మెట్లెక్కిన యువతి!

- తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పసుపులేటి దుర్గా రామలక్ష్మి సాహసం
- సుమారు 450 మెట్లు మోకాళ్లపై ఎక్కినట్లు వెల్లడి
- జనసేనానిపై అభిమానంతోనే ఇలా మోకాళ్లపై మెట్లు ఎక్కినట్లు వ్యాఖ్య

**పిఠాపురం, జర్నలిస్ట్ ఫైల్ :** మరో మూడు రోజుల్లో ఏపీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విజయం సాధించాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ యువతి మోకాళ్లపై తిరుమల మెట్లు ఎక్కారు. ఉండ్రాజవరానికి చెందిన ఆర్ఎంపీ వైద్యురాలు పసుపులేటి దుర్గా రామలక్ష్మికి పవన్ అంటే ఎనలేని అభిమానం. ఈ ఎన్నికల్లో జనసేనాని గెలవాలని ఆమె తిరుమల శ్రీవారిని మెక్కుకున్నారు. అందులో భాగంగా మే 25న సుమారు 450 మెట్లు మోకాళ్లపై ఎక్కినట్లు రామలక్ష్మి మీడియాతో తెలిపారు. పార్టీలతో తనకు సంబంధం లేదని, కేవలం పవన్ కల్యాణ్‌పై ఉన్న అభిమానంతోనే ఇలా మోకాళ్లపై మెట్లు ఎక్కినట్లు ఆమె చెప్పారు. పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఆయన భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ఈ సందర్భంగా దీమా వ్యక్తం చేశారు.





జర్నలిస్ట్ ఫైల్

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968

అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.

Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467